ఆదిలాబాద్ జిల్లా
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నవతెలంగాణ 2015-2023 ANNIVERSARY CELEBRATIONS
నవతెలంగాణ 8వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక
8 పేజీలు | గురువారం 31 ఆగస్టు 2023 | www.navatelangana.com

పేద విద్యార్థులకు సాంకేతిక విద్య

- ఆదిలాబాద్ జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల
- సాత్నాల వద్ద నిర్మించేందుకు ప్రతిపాదనలు
- ఐటీ టవర్ నిర్మాణంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు
- ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ప్రయోజనం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల మంజూరుకావడంతో జిల్లా విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి రానుంది. ఈ కళాశాల మంజూరు చేస్తూ రాష్ట్ర సాంతికే విద్యశాఖ కమిషనర్ వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. జేఎన్‌టీయూకు అనుబంధంగా సాగే ఈ కళాశాల మంజూరుకావడంతో ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ప్రయోజనకరంగా మారుతోంది. స్థానికంగానే సాంకేతిక విద్య లభించనుంది. ప్రస్తుతం హైదరాబాదు, వరంగల్ వంటి ప్రాంతాలకు వెళ్లి చదువుకొనే విద్యార్థులు వచ్చే ఏడాది నుంచి జిల్లాలోనే ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసేందుకు అవకాశం లభించనుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

విద్యాపరంగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు లేవు. గతంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ ప్రయివేటు కళాశాల ఉన్నప్పటికీ అప్పట్లోనే మూతపడి..ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిపోయింది. దశాబ్ధ కాలంగా జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల అంటూ లేకుండా పోయింది. ఇంజనీరింగ్ విద్యను చదవాలంటే తప్పనిసరిగా హైదరాబాద్, వరంగల్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలోనూ ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకోవడం ఇక్కడి విద్యార్థులకు ప్రయోజనకరంగా మారనుంది. ఈ కళాశాలను ఆదిలాబాద్ జిల్లాలోని సాత్నాల మండల కేంద్రంలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ అవసరమైన స్థలం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నారు. జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల అందుబాటులోకి రావడంతో జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఫీజు రియంబర్స్‌మెంట్ సౌకర్యంతో సులభంగా ఇంజనీరింగ్ విద్యను అభ్యసించేందుకు అవకాశం లభిస్తుంది. ఇంటర్ పూర్తికాగానే ఎంసెట్‌లో ర్యాంకు సాధిస్తే బీటెక్‌లో చేరేందుకు అవకాశం ఉంటుంది. కంప్యూటర్ సైన్స్, ఐటీ, సివిల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ తదితర కోర్సుల్లో చేరేందుకు అవకాశం లభిస్తుంది. ఒక్కో కోర్సులో సుమారు 80మంది విద్యార్థులను పరిగణనలోకి తీసుకున్నా..ఏడాదికి సుమారు 300 నుంచి 400మంది విద్యార్థులకు ఈ కళాశాలలో సీట్లు లభించనున్నట్లు తెలుస్తోంది.

నెరవేరిన ముఖ్యమంత్రి హామీ..!

నిర్మల్ జిల్లా కేంద్రంలో రెండు నెలల క్రితం నిర్వహించిన ప్రగతి నివేదిక సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ▶ మిగతా..4లో...



అందమైన జలపాతాలు ఆదిలాబాద్ సొంతం

● రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతం 'కుంటాల' ● జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల జాలువారే జలపాతాలు

నవతెలంగాణ-ఇచ్చోడ

ఆదిలాబాద్ జిల్లాలో ప్రకృతి అందాలకు కొదవే లేదు. ఎత్తైన కొండలు, లోతైన జలపాతాలు ఇక్కడున్నవన్ని రాష్ట్రంలో మరెక్కడా లేవు. అడవుల విషయంలో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అడవుల జిల్లాగా పిలుచుకోవడమే దీనికి నిదర్శనం. వీటితో పాటు దర్శనీయ రమణీయ స్థలాలు చాలా ఉన్నాయి. దక్షిణ భారతదేశంలోనే పేరెన్నికగన్న సరస్వతీ కొలువైంది ఆదిలాబాద్‌లోనే. అంతేకాదు రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతం కూడా ఇక్కడే ఉంది. ప్రత్యేకంగా జలపాతాల గురించి చెప్పుకున్నప్పుడు కుంటాలతో పాటు పొచ్చెర ప్రాచుర్యం పొందాయి. వీటితో పాటు జిల్లాలో మరికొన్ని జలపాతాలు ఇటీవల కాలంలో వెలుగు చూశాయి.


కనక దుర్గ జలపాతం

ఎత్తైన జలపాతం కుంటాల

బోథ్ నియోజకవర్గంలోని నేరడిగొండ మండలంలో ఉన్న కుంటాల జలపాతం తెలంగాణ రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతంగా పేరొందింది. దీనికి సమీపంలోనే ఉన్న పొచ్చెర జలపాతం కూడా ప్రసిద్ధి చెందింది. నేరడిగొండ మండల కేంద్రం నుండి సుమారు 12 కిలో మీటర్ల దూరంలో కుంటాల జలపాతం ఉంటుంది. జలపాతం వద్దకు చేరుకోవాలంటే మెట్లు దిగి వెళ్లాలి. జలపాతం దగ్గరికెళ్తున్న కొద్ది పైనుండి పరుగులు తీసుకుంటూ వస్తున్న నీళ్లను చూస్తుంటే భలేగా ఉంటుంది. 45 అడుగుల ఎత్తు నుండి నీళ్లు పడుతుండడంతో ఒక రకమైన వినసొంపైన శబ్దం వినిపిస్తుంది. దగ్గరికెళ్లగానే ఇక్కడా ప్రమాద హెచ్చరికలను అక్కడున్న వారు తెలియజేస్తారు. పైనుండి వయ్యారంగా కిందకు జాలువారుతున్న నీటి ప్రవాహం చూస్తుంటే తన్మయం చెందకుండా ఉండలేం. నిత్యం అక్కడికి వచ్చే సందర్శకులు జాలిజాలిగా జలపాతం వద్ద సేద తీరుతుంటారు. సెలవుల సందర్భంగా స్థానిక, వివిధ ప్రాంతాల నుండి పాఠశాల విద్యార్థులు అక్కడ వన భోజనాలు చేసుకుంటారు. జాతీయ రహదారి నెం.44పైనే నేరడిగొండ మండల కేంద్రం ఉంటుంది. హైదరాబాద్-నాగ్‌పూర్ ప్రధాన మార్గం ఇది. నేరడిగొండ మండల కేంద్రంలో దిగగానే జలపాతానికి చేరుకోవడానికి ఆటోలు అందుబాటులో ఉంటాయి. దట్టమైన అటవీ ప్రాంతంలో మధ్యలో ఎత్తైన ప్రదేశం నుండి నీరు కిందికి తుళ్లిపడుతుండడం ఇక్కడ ప్రత్యేకత. జలపాతం పక్కనే ఏడు అడుగుల ఎత్తులో గుహ ఉంది. దీని గుండా మనిషి మాత్రమే ప్రవేశించడానికి అవకాశం ఉంది.


కుంటాల జలపాతం

పొచ్చెరా ప్రసిద్ధిచెందిందే..

పొచ్చెర జలపాతం బోథ్ నియోజకవర్గ కేంద్రానికి వెళ్లే మార్గంలో ఉంటుంది. రోడ్డుపై దిగి నడుచుకుంటూ వెళ్లేంత దూరంలోనే జలపాతం ఉంటుంది. జాతీయ రహదారి నెం.44 నుండి సుమారు 10 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. బోథ్ ఎక్స్‌రోడ్డుపై దిగితే అక్కడి నుండి బోథ్‌కెళ్లే బస్సులు అందుబాటులో ఉంటాయి. చూడముచ్చటగా ఉన్న జలపాతాన్ని ఆనుకొని పార్కు ఏర్పాటు చేసుంది. ఇక్కడా గైడ్ జలపాతం వద్దకెళ్లొద్దని, ప్రమాదమని హెచ్చరిక చేస్తారు. పిల్లలను దూరంగా ఉంచడం మంచింది. కొండకోనల మధ్య నుండి నీళ్లు వయ్యారంగా వంపులు తిరుగుతూ వస్తుంటాయి. పైనుండి కిందకు పడుతున్న నీటిని చూస్తుంటే మధురానుభూతిలా అనిపిస్తుంది. పైనుండి పడుతున్న నీటిని చూస్తే ఎవరికైనా ఆ నీటిలో తడిసిపోవాలని అన్పిస్తుంది. అన్నట్టుగానే సందర్శకులు షవర్ మాదిరిగా పడుతున్న ఆ ధారల కింద తడిసిపోయి తన్మయం చెందుతుంటారు. చూడముచ్చటైన సీన్లను వెంట తెచ్చుకొని కెమెరాలో బంధిస్తుంటారు. తీయని అనుభూతులను పదిలపర్చుకోవడానికి ప్రకృతి అందాల మధ్య ఫొటోలు సైతం దిగుతుంటారు. జలపాతం వద్ద ఉన్నంత సేపు అన్నీ మరిచిపోతుంటారు. టైంను గుర్తుకు తెచ్చుకొని బలవంతంగా అక్కడి నుండి వెళ్తుంటారు.

అలరిస్తున్న పెద్దయ్యగుట్ట జలపాతం

ఆదిలాబాద్ జిల్లా నుండి మంచిర్యాల వెళ్లే జాతీయరహదారిపై దండేపల్లి మండలం ఉంది. మండల కేంద్రం నుండి ఆరు కిలోమీటర్లదూరం వెళ్తే పెద్దయ్యదేవుని ఆలయం వస్తుంది. అక్కడి నుండి మరో రెండు కిలోమీటర్లు నడిచివెళ్తే పెద్దయ్యజలపాతం వస్తుంది. చుట్టూ ఎత్తైన గుట్టల నడుమ నుండి రయ్‌మంటూ జాలువారుతూ వచ్చే నీళ్లతో జలపాతం అందాలు చూడడానికి రెండు కళ్లు చాలవు. అయితే ఇంతటి సుందరదృశ్యాలను తిలకించడానికి వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇది బాహ్యప్రపంచానికి తెలవడం లేదు. చుట్టూ ఎత్తైన నాలుగు గుట్టల మధ్య ఉన్న జలపాతానికి వెళ్లేందుకు అడవిలో నుండి కాలిబాట తప్ప సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇది పర్యాటకుల దృష్టిని ఆకర్షించలేకపోతోంది. మండల కేంద్రం నుండి ఐదు కిలోమీటర్లు కాలినడకన రాళ్ల మధ్య నుండి వెళ్తే పెద్దయ్యగుట్టకు చేరుకోవచ్చు. అక్కడి పరిసరాలను చూసి తనివితీరా చూసి కాసేపు సేద తీరొచ్చు. తర్వాత అక్కడి నుండి రెండు కిలోమీటర్లు నడిచి వెళ్తే జాలువారుతూ కనిపించే పెద్దయ్యజలపాతం ఉంటుంది. ఇక్కడికి వెళ్లేందుకు ఏడు కిలోమీటర్ల వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తే ఎత్తైన కొండల మీదుగా వచ్చే నీటితో అలరారే పెద్దయ్యజలపాతం అందాలు అందరికీ కనువిందు చేసే అవకాశం ఉంది. ఇక్కడికి ఏటా చుట్టుపక్కల ప్రజలు పెద్దగుట్టకు వచ్చి ఆలయంలో పూజలు చేస్తారు. అనంతరం రెండు కిలోమీటర్లు నడిచివెళ్లి పెద్దయ్య జలపాతం అందాలను తనివితీరా చూసి పరశించిపోతున్నారు. సౌకర్యాలు లేని కారణంగానే చుట్టుపక్కల వారికి తప్ప ఇతర ప్రాంతాల వారికి చేరువకాలేకపోతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడంతోపాటు రోడ్డు సౌకర్యం కల్పిస్తే జలపాతం మరింత పర్యాటకులను ఆహ్లాదపరిచే అవకాశం ఉంది.


జలపాతం వద్ద ఫోటో షూట్


మిట్టే జలపాతాలకు సందర్శకుల తాకిడి

సిర్పూర్(యు) మండలంలోని పిట్టగూడ-లింగాపూర్ గ్రామాల సమీపంలో అటవీ ప్రాంతంలో పచ్చని చెట్లు, గుట్టల మధ్యలో సప్తగుండాలు(మిట్టే) జలపాతాలున్నాయి. మండల కేంద్రం నుండి రెండు దారులున్నాయి. జైనూర్ నుండి పిట్టగూడ సూమారు 15కిలో మీటర్లు, లింగాపూర్ 16కిలో మీటర్ల దూరంలో ఉంటాయి. ఈ రెండు గ్రామాల వరకు బీటీ రోడ్డు సౌకర్యం ఉంది. అయితే అక్కడికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో సందర్శకులు కొంత ఇబ్బందులు పడుతున్నారు. అక్కడి నుండి రెండు కిలో మీటర్లు అటవీ ప్రాంతంలో వాగులు వంకలు దాటి వెళ్తే మిట్టే జలపాతాల ప్రాంతానికి చేరుకుంటాం. ముందుగా పెద్ద మిట్టేకు చేరుకుంటాం ఇక్కడ సుమారు వంద మీటర్ల పైనుండి నీరు కిందికి పడుతుంది. పైనుండి నీరు కిందికి జారి పడుతుంటే ఆ ధారలు ఎంతగానో ఆకట్టుకుంటుంది. పచ్చని చెట్లు, బండరాళ్లు చూడముచ్చటగా కనబడతాయి. అక్కడి నుండి ఓ ఫర్‌లాంగ్ దూరంలో మరో జలపాతం చిన్నమిట్టే ఉంది. ఇక్కడా వంద మీటర్ల పైనుండి కిందికి నీరు పడుతుంటే పాలు పొంగుతున్న దృశ్యం కళ్లముందు కదలాడుతుంది. పెద్దపెద్ద రాళ్ల పైనుండి నడుచుకుంటూ పోతుంటే మరిచిపోలేని


మిట్టే జలపాతం

అనుభూతి కల్గుతుంది. చెట్లపై పక్షుల కిలకిల రాగాలు, అడవి జంతువుల పరుగు పందేలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఇటీవల కాలంలో మిట్టే జలపాతాలకు సందర్శకుల తాకిడి పెరిగింది. జిల్లా పర్యాటకులతో పాటు వరంగల్ నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున సందర్శకులు సెలవు రోజుల్లో వస్తుంటారు. ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇక్కడ షార్ట్ ఫిల్మ్ కూడా చిత్రీకరించారు. ప్రస్తుత ఉట్నూర్ ఐటిడిఏ పిఓ ఆర్‌వి.కర్ణన్‌తో పాటు ఇతర ఐఎఎస్ అధికారులు ఈ జలపాతాలను సందర్శించారు. రెండు సంవత్సరాల క్రితం రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎంఎల్ఎ, ఎంపిలకు ఈ ప్రాంతవాసులు విజ్ఞప్తి చేశారు. రోడ్డు సౌకర్యం కల్పిస్తే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది.

ఆహ్లాదపరుస్తున్న కనకాయి జలపాతం

బజార్‌హత్నూర్ మండలంలోని కనకాయి(కనక దుర్గ) జలపాతం ఆహ్లాదాన్నిస్తోంది. ఎత్తైన గుట్టలమీద నుండి జలజలా జాలువారుతూ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తోంది. జలపాతానికి దగ్గరగా కనక దుర్గ విగ్రహం ఉండటం వలన ఈ జలపాతానికి కనకదుర్గ జలపాతామనే పేరొచ్చింది. కాకతీయ రాజుల కాలం నుండే ఈ జలపాతం వెలుగులోకి వచ్చినా అటవీ ప్రాంతంలో ఉండడంతో అంత ప్రాచుర్యంలోకి రాలేకపోయింది. ప్రస్తుతం సంవత్సరం కిందటే జలపాతానికి ఎంపీ నిధులతో రోడ్డు సౌకర్యం కల్పించారు.


పెద్దయ్య గుట్టజలపాతం

ప్రకృతి ఒడిలో బెబర్ఝరి జలపాతం

కెరమెరి కొమురం భీం పోరుగడ్డ జోడేఘాట్‌కు వెళ్లే మార్గంలో బాబేర్ఝరి గ్రామ సమీపంలోని అడవుల్లో ఏర్పడిన జలపాతం సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఎత్తైన కొండలు, దట్టమైన అడవులు, బండరాళ్ల మధ్య సహజ సిద్ధంగా ఏర్పడిన జలపాతమే బాబెర్ఝరి జలపాతం. నాలుగు దిక్కులా దట్టమైన అడవులు, ఎత్తైన కొండలు, లోతైన లోయ వద్ద ఈ జలపాతం చూపరులను ఆకర్షిస్తోంది. ఈ జలపాతాన్ని చూడాలంటే మండలకేంద్రం నుండి సుమారు 12 కిలోమీటర్ల దూరం వరకు రోడ్డు సౌకర్యం కలదు. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు ద్వారా ప్రయాణించి ఈ జలపాతం అందాలను వీక్షించవచ్చు. సుమారు 300 మీటర్ల ఎత్తు నుండి నీళ్లు లోయలో పడతాయి. వర్షాకాలంలో మాత్రమే ఈ జలపాత దృశ్యాలు చూడవచ్చు. చలి, ఎండకాలాల్లో నీటి ప్రవాహం ఉండదు. వర్షాకాలంలో ఈ జలపాతాన్ని చూడడానికి పెద్దఎత్తున సందర్శకులు వస్తుంటారు. జలపాతం వద్ద జారుడు బండరాళ్లు ఉండడం వలన ప్రమాదకరంగా ఉంది. ప్రభుత్వం ఈ జలపాతాన్ని గురించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిచినట్లయితే సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

గాయత్రి జలపాతం

ఇచ్చోడ మండలం గుండివాగు గ్రామ సమీపంలో పచ్చటి అడవుల మధ్యలో జాలువారే నీళ్లతో కనిపిస్తుంది. అదే గాయత్రి జలపాతం. ఇక్కడికి స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల వారు కూడా వస్తుంటారు. 2016లో ప్రపంచ సన్నాహక వాటర్ రాఫెల్లింగ్ పోటీలు జరిగాయి. పోటీలో 150 మంది సాహస క్రీడాకారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుండి సాహస క్రీడాకారులు వచ్చి జలపాతంలో రాఫెల్లింగ్ పోటీల్లో పాల్గొన్నారు. మండలంలోని మేడిగూడ ఆశ్రమ పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గాయత్రి జలపాతం మండల కేంద్రం నుంచి 15కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. సిరిచెల్మ వైపు వెళ్లే రోడ్డు గుండా మేడిగూడ గ్రామం వరకు బీటీ రోడ్డు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి 5కిలో మీటర్ల వరకు మొరం రోడ్డు ఉంటుంది. వర్షాకాలంలో కొంత మేర రోడ్డు చిత్తడిగా ఉంటుంది. పెద్ద వాహనాలు పోవడానికి వీలు పడదు. ఇతర కాలాల్లో జలపాతం వరకు అన్ని రకాల వాహనాలు వెళు ్తంటాయి.


గాయత్రి జలపాతం

సంక్షేమం బాగు.. అభివృద్ధి మెరుగు..!

- కొత్త కలెక్టరేట్లు..మెడికల్ కళాశాలలు నిర్మాణం
- పరిపాలన సౌలభ్యం..నాణ్యమైన వైద్యం
- గురుకులాల ఏర్పాటుతో పేద విద్యార్థులకు విద్య
- జిల్లాలో సమకూరుతున్న మౌళిక సదుపాయాలు
- సాగునీటి ప్రాజెక్టులతో పంటలు సస్యశ్యామలం
- ఉమ్మడి జిల్లాలో గతం కంటే మెరుగైన అభివృద్ధి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో గతం కంటే మెరుగుపడింది. ఇది వరకు ఉమ్మడి రాష్ట్రంలో అంతగా కనిపించని సంక్షేమం.. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత వడివడిగా పరుగులు పెడుతోంది. జిల్లాల విభజన తర్వాత పరిపాలన మరింత సౌలభ్యంగా మారడంతో పాటు మౌళిక వసతులు సమకూరుతున్నాయి. ఇది వరకు ఉమ్మడి జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్‌లో మాత్రమే మెడికల్ కళాశాల ఉండగా తాజాగా కొత్తగా ఆవిర్భవించిన నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ ఏర్పాటయ్యాయి. దీంతో ఆ జిల్లాలోనూ పేదలకు మెరుగైన వైద్య సేవలు లభించనున్నాయి. ప్రతి ఏటా వంద మంది విద్యార్థులు వైద్యవిద్యలో ప్రవేశం పొందేందుకు అవకాశం దక్కనుంది. వీటితో పాటు గురుకుల పాఠశాలల సంఖ్యను పెంచడంతో అనేక మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తోంది. సాగునీటి ప్రాజెక్టులు..దళితబస్తీ, దళితబంధు తదితర పథకాల ద్వారా జనానికి లబ్ధి చేకూరుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వివిధ రంగాల్లో ప్రగతి దిశగా పయనమవుతోంది. ఇప్పటికే చేపట్టిన కొన్ని ప్రాజెక్టులతో పాటు కొత్త వాటితోనూ పలు ప్రయోజనాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం..అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తోంది.జిల్లాల విభజన తర్వాత పరిపాలన సౌలభ్యం కోసం నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో నూతన కలెక్టరేట్లను నిర్మించింది. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ వీటిని ప్రారంభించారు. ఆదిలాబాద్‌లోనూ పనులకు త్వరలో శంకుస్థాపన జరగనుంది. ఇది వరకు ఆదిలాబాద్‌లో మాత్రమే ఉన్న వైద్య కళాశాలలు తాజాగా మిగితా మూడు జిల్లాల్లోనూ ప్రారంభం కానున్నాయి. వీటితో పాటు కొత్తగా నిర్మించిన చనక-కోర్త, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టుల నిర్మాణంతో పంటలకు సాగునీరు అందనుంది. మరిన్ని ఎకరాలు సాగులోకి రానున్నాయి. కానీ చనక-కోర్త ప్రాజెక్టు పూర్తయినా డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం జరగకపోవడంతో పంటలకు సాగునీరు అందడం లేదు. ఈ కాల్వల నిర్మాణం పూర్తయితే పంటలు సస్యశ్యామలంగా మారనున్నాయి. ముఖ్యంగా కొత్తగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల సంఖ్యను పెంచడంతో అనేక మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తోంది. వృద్ధులకు ప్రతి నెలా రూ.2016చొప్పున, వికలాంగులకు రూ.4016చొప్పున అందజేయడంతో వారికి ఆర్థిక చేయూత లభిస్తోంది.

గ్రామీణ రోడ్లకు మహర్దశ..!

ఈ తొమ్మిదేండ్ల కాలంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టుకుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న గతుకుల రోడ్లతో జనం ఇబ్బందుల పాలయ్యేవారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. చాలా గ్రామాలకు అనుసంధానంగా బీటీరోడ్లు వేయడంతో పాటు మండల కేంద్రాలకు వెళ్లేందుకు డబుల్‌రోడ్లను వేయించింది. కానీ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో అనేక గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడం ఇబ్బందిగా మారుతోంది. వాగులపై వంతెనలు లేకపోవడంతో గర్భిణీలను అత్యవసర సమయంలో ఆస్పత్రికి తరలించేందుకు అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఇక వీటితో పాటు గ్రామాల్లో స్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు, ఇంటింటికి చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లు, పారిశుధ్య కార్మికుల నియామకం తదితర సౌకర్యాలు కల్పించడంతో గ్రామాల్లో పరిస్థితులు చాలా వరకు మెరుగుపడుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారిని సుందరంగా తీర్చిదిద్దడం.. ప్రధాన కూడళ్లు అందంగా ముస్తాబు చేయడంతో పట్టణం ఆకర్షణీయంగా కనిపిస్తోంది. వీటితో పాటు జిల్లాలో పలు అభివృద్ధి పనులు జరగడం ప్రజలకు సానుకూలంగా మారుతోంది.

షోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకోవాలి

- కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన రెండో ఏఎన్‌ఎంలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎటువంటి రాత పరీక్షలు లేకుండా రెగ్యులర్ చేయాలని సమ్మెలో ఉన్న కాంట్రాక్ట్ రెండో ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. తమ సమస్యల పట్ల పరిష్కారం చూపకుండా షోకాజ్ నోటీసులు పంపడం సరికాదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. షోకాష్ నోటీసులకు తాము బయపడబోమని స్పష్టం చేశారు. కాగా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె 16వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, ఏఎన్‌ఎంలు పుష్పాల, సావిత్రి, ఆనంద బాయ్, వెంకటమ్మ, విజయసుందరి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1, 2వ తేదీల్లో ఎంపిక క్రీడలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కాంతారావ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖోఖో అండర్-17 ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఉంటాయన్నారు. అదే విధంగా సెప్టెంబర్ 2న గాదిగూడ మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో అండర్-14, 17 బాలుర జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖోఖోలో పాల్గొనే వారు 1 జనవరి 2007 తర్వాత జన్మించిన క్రీడాకారులు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. వాలీబాల్ అండర్ 14 విభాగంలో 1 జనవరి 2010, అండర్ 17 1 జనవరి 2007 తర్వాత జన్మించిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన క్రీడాకారులు సంబంధిత వయసు ధ్రువీకరణ పత్రం బోనఫైడ్ తో పోటీల కన్వీనర్ ప్రిన్సిపల్ కనక రామారావు, ఆర్గనైజర్ రాథోడ్ శ్రీనివాస్ లకు ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. మరిన్నీ వివరాలకు సెల్:9493534163 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో(బోథ్) మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఎస్టీ విద్యార్థుల నుండి స్పాట్ అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస స్వామి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ(ఎంపీసీఎస్, డాటా సైన్స్, బిజెడ్సీ) బీకాం (సీఏ) ప్రవేశాలకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుండి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9849390495 సంప్రదించాలన్నారు.

రెవెన్యూ డివిజన్ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి చేరవేయండి

నవతెలంగాణ-బోథ్

రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో బోత్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించిన వినతిని రాష్ట్ర ప్రభుత్వానికి చేరవేయాలని ఆ సమితి నాయకులు కోరారు. బుధవారం ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయిని బోథ్ రెవెన్యూ డివిజన్ సాధన సమితి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 31 అంశాలతో కూడిన వినతిని గతవారం ఇచ్చామని గుర్తు చేశారు. ముఖ్య ఎన్నికల అధికారికి చేరవేయాలని, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ ప్రజా సంఘాలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి మా వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. తమ డిమాండ్‌ను నెరవేర్చేందుకు పూర్తి సహకారం ఇవ్వాలని కోరారు. లేనియెడల 200 నామినేషన్లు వేసి ప్రభుత్వంపై నిరసన తెలుపుతామని రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు ఎన్నికల అధికారికి విన్నవించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సాధన సభ్యులు పాల్గొన్నారు.

గోండుల ఆరాధ్య దైవం నాగోబా

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



కొండకోనల్లో నివసించే గిరిజనులు తమ జాతి దైవంగా నాగోబాను కొలుస్తారు. దక్కన్ పీఠభూమి గిరిపుత్రులందరికీ నాగోబాయే ఆరాధ్యదైవం. ప్రతి సంవత్సరం పుష్యమాసం(జనవరి, ఫిబ్రవరి) అమావాస్య రోజున అత్యంత వైభవంగా నాగోబా జాతర జరుగుతుంది. ఈ దేవాలయం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్ గ్రామంలో ఉంది. జాతర కోసం జిల్లా అధికార యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేస్తుంది. జాతరకు వచ్చే పొరుగు రాష్ట్రాల గిరిజనులకు సౌకర్యాలు కల్పిస్తారు. అయితే జాతర చివరి రోజున 'ప్రజాదర్బార్' నిర్వహించడం ఆనవాయితీ. దీన్ని 1946 సంవత్సరంలో ప్రముఖ మానవ పరిణామ శాస్త్రవేత్త హెమన్‌డార్ఫ్ ప్రారంభించినట్లు చరిత్ర చెబుతోంది. అప్పట్నుంచి అధికార దర్బార్ నిర్వహించడం సాంప్రదాయంగా కొనసాగుతోంది. ఆ రోజు జిల్లా కలెక్టర్ సహా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కెస్లాపూర్‌లో కొలువు దీరుతారు. వివిధ తెగలకు చెందిన గిరిజనులు సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేస్తారు. వాటిని అక్కడికక్కడే పరిష్కారమయ్యే ఈ వేదిక ఏర్పాటు చేశారు. కాని ఏటా సమస్యలపై విన్నవించినా పరిష్కారమార్గం దొరకకపోవడంతో 'ప్రజాదర్బార్' ప్రాధాన్యత కోల్పోతోంది. జాతర సందర్భంగా పుష్యమాసం అమావాస్య రోజున మెస్రం తెగ గిరిజనులు గోదావరి నదీ జలాలతో నాగోబాకు అభిషేకం చేసి పూజలు చేస్తారు.

నాగోబా వెనుక..

కొన్ని సంవత్సరాల క్రితం నాగేంద్రుడు మెస్రం కుటుంబానికి చెందిన నాగాయి మోతి, రాజి దంపతులకు కలలో కనిపించి సర్పం రూపంలో జన్మిస్తానని చెప్పాడట. ఆ తర్వాత కల నిజమైందని గిరిపుత్రులు విశ్వసిస్తారు. కొంత కాలానికి నాగేంద్రుడి తల్లి తన తమ్ముని కూతురు గౌరితో సర్ప రూపంలో గల నాగేంద్రుని వివాహం జరిపిందట. అత్త ఆజ్ఞ మేరకు గౌరి భర్త అయిన నాగేంద్రున్ని బుట్టలో పెట్టుకొని గోదావరికి పయనమైనట్లు గిరిజనులు చెబుతుంటారు. ప్రయాణం మధ్యలో పాము ఒక చోట ఉడుము రూపంలో కన్పించగా ఆ ప్రాంతం ఉడుంపూర్‌గా మారింది. అనంతరం ధర్మపురి నదిలో గౌరి స్నానం చేస్తుండగా ఆమెను చూసి నాగేంద్రుడు మనిషిగా మారాడట. కాగా నాగేంద్రుడు పేరు ప్రతిష్టలు కావాలో, సాంప్రదాయం కావాలో తెల్పుమని అనగా గౌరి సాంప్రదాయాలను కాదని పేరు ప్రతిష్టలు కోరుకోగా మనిషి తిరిగి పాముగా మారినట్లు కథనం. తదనంతరం ఉడుంపూర్ నుండి గరిమెల వరకు వెతికిన గౌరి గోదారి నదిలో సత్యవతి గుండంలో కలిసి పోయిందని ప్రచారంలో ఉంది. గౌరి వెంట నాగేంద్రుడు ఉంచిన ఎద్దు బండగా మారింది. తర్వాత ప్రతి జంటకు బెటికొరియాడ్(నాగోబా సమక్షంలో కొత్త జంటలను కలపడం) తన సన్నిధిలోనే జరగాలని చెప్పి నాగేంద్రుడు కెస్లాపూర్ గుట్టల్లోకి వెళ్లిపోయాడని చెబుతుంటారు. కాలక్రమేణా అదే కెస్లాపూర్ గ్రామంగా మారిపోయింది. నాగేంద్రుడు వెళ్లిన పుట్ట వద్ద నాగోబా దేవాలయం వెలిసింది. ప్రతి ఏటా పుష్య అమావాస్య రోజున నాగేంద్రుడు ప్రత్యక్షమవుతాడని గోండుల ప్రగాఢ విశ్వాసం.

ప్రయోజనం లేని 'ప్రజాదర్బార్'

నాగోబా జాతర సందర్భంగా జిల్లా యంత్రాంగం కెస్లాపూర్ తరలొచ్చి గిరిజనం సమస్యల పరిష్కారానికి దర్బార్ నిర్వహిస్తున్నా వారికి ఏమాత్రమూ ఉపయోగపడడం లేదు. గిరిజన జీవితాలను అధ్యయనం చేసి వీరి కోసం ఒక వేదికను ఏర్పాటు చేశారు హెమన్‌డార్ఫ్. ఆనాటి నుండి నేటి వరకు ప్రతి ఏటా దర్బార్‌లు జరుగుతూనే ఉన్నాయి. గిరిజన తండాల్లో సమస్యలు సమస్యలుగానే దర్శనమిస్తున్నాయి. ప్రజాదర్బార్‌లో సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయని కేవలం ప్రచారానికే పరిమితమైంది. నేటి కంప్యూటర్ యుగంలో కూడా తండాల్లో గిరిజనులకు గుడిసెల్లోనే జీవిస్తున్నారు. వాగు, వంకల నీరే తాగుతున్నారు.



కేసీఆర్ అభివృద్ధిని చూసి ఆదరించాలి

- టీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్



నవతెలంగాణ-తాంసి

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు, అభివృద్ధిని చూసి ఆదరించాలని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం భీంపూర్ మండలం గుబిడి, టెక్నిరాంపూర్, కొజ్జన్‌గూడ, కరంజి, ఇంద్రనగర్, కరణ్‌వాడి, అంతర్గాం, ఇందూరుపల్లి గ్రామాలలో డిసిసిబి చైర్మన్‌తో పాటు మండల నాయకులతో కలిసి పర్యటించారు. టీఆర్ఎస్ అభ్యర్థిని డప్పు చప్పులతో ఘనంగా ఆహ్వానించి శాలువాలతో గ్రామ ప్రముఖులు, సర్పంచులు సన్మానించారు. గ్రామ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క కుటుంబానికి చేరాయన్నారు. చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి అభ్యర్థిగా తనను ఆదరించాలని ప్రజలను కోరారు. యువత రాజకీయాల్లోకి రావాలని ఉద్దేశంతో కేసీఆర్, కేటీఆర్ తనను బోథ్ అభ్యర్థిగా బలపరిచారన్నారు. కొత్త తరానికి అవకాశం ఇచ్చి బోథ్ నియోజకవర్గాన్ని, భీంపూర్ మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం వచ్చిందన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జెడ్పిటిసి సుధాకర్, ఎంపీపీ రత్నప్రభ సంతోష్, ఎంపీపీ తులా శ్రీనివాస్, సర్పంచులు నరేందర్, ప్రతాప్ యాదవ్, వైస్ ఎంపీపీ లక్ష్మన్న, కన్వీనర్ నాగయ్య, నాయకులు కృష్ణ, లింబాజీ, అఫ్రోజ్, రజినీకాంత్‌రెడ్డి, కల్చప్ యాదవ్, తిరుమల్‌గౌడ్, ప్రీతంరెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాంకేతిక విద్య

(మొదటి పేజీ తరువాయి)

పలు హామీలు ఇచ్చారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాలను మంజూరుచేస్తామని ప్రకటించారు. తాజాగా అధికారికంగా ఉత్తర్వులు రావడంతో త్వరలోనే కార్యరూపం దాల్చనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సాంకేతిక కళాశాల స్థాపనతో విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు.

ఐటీ టవర్ నిర్మాణం

జిల్లాలో సాఫ్ట్‌వేర్ రంగం సంస్థలు ప్రవేశించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే డీబీఎన్‌టీ అనే ఐటీ సంస్థ ఆదిలాబాద్‌లో తన కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ సంస్థలో పలువురు జిల్లాకు చెందిన యువత సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. తాజాగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ఐటీ టవర్ నిర్మాణానికి నిధులు మంజూరుచేసింది. పట్టణ శివారులోని బట్టి సవర్గాం ప్రాంతాల్లో ఈ టవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇది పూర్తికాగానే పలు ఐటీసంస్థలు తమ కార్యకలాపాలు మొదలు పెట్టేందుకు ఆస్కారం ఉంటుంది. పలు కంపెనీలు ఉద్యోగాల కల్పనకు పెద్దపీఠ వేయనున్నాయి. దీంతో జిల్లాకు చెందిన యువతకు స్థానికంగానే సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి లభించనుంది. ఇప్పటి వరకు హైదరాబాదు, బెంగళూరు వంటి ప్రధాన నగరాలకే పరిమితమైన ఐటీ సేవలు ఆదిలాబాద్ జిల్లాలోనూ ప్రారంభమయ్యేందుకు అవకాశం లభించనుంది.

పరిశ్రమ..నిరీక్షణ..!

- కొత్త వాటి ఊసు లేదు..పాత వాటికి ప్రోత్సాహం లేదు
- ప్రతిపాధనలకే పరిమితమైన పారిశ్రామిక కారిడార్
- పెరుగుతున్న నిరుద్యోగం..అభివృద్ధికి అవరోధం
- ఎస్పీఎం తెరుచుకోవడంతో కొంత ప్రయోజనం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పారిశామ్రిక ప్రగతి అటకెక్కుతోంది. ప్రభుత్వ ఆర్బాటపు ప్రకటనలు కేవలం మాటలకే పరిమితమవుతున్నాయి. పరిశ్రమల స్థాపన హైదరాబాదుకే కేంద్రీకృతమవుతోంది. ఇతర జిల్లాలో ఆ ఛాయలు కనిపించడం లేదు. కొత్త పరిశ్రమలు రాకపోగా.. పాత వాటి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడంతో మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 27వరకు జిన్నింగ్ పరిశ్రమలు మూతపడటం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రభుత్వం ప్రతిపాధించిన హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్ కేవలం మాటలకే పరిమితమైంది. పరిశ్రమలు లేని కారణంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి అవరోధంగా మారుతోంది. ఉపాధి లభించక నిరుద్యోగం పెరిగేందుకు కారణమవుతోంది. జిల్లాలో పుష్కలమైన వనరులు ఉన్నా వాటి అనుబంధ పరిశ్రమలు రావడం లేదు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు అనుకూలతలు ఉన్నా ఆ దిశగా ముందడుగు పడటం లేదు. సిర్పూర్ పేపర్ మిల్(ఎస్పీఎం), జైపూర్‌లో విద్యుత్ ఉత్పత్తి పరిశమ్ర (ఎస్‌టీపీసీఎల్)లు మినహా కొత్త పరిశమ్రలు నెలకొల్పలేదు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక ప్రగతి అంతంత మాత్రమే కనిపిస్తోంది. పరిశ్రమల స్థాపనపై అనేక ఆశలు పెట్టుకున్న జిల్లావాసులకు నిరాశ తప్పడం లేదు. తెలంగాణ ఆవిర్భావం తర్వాతైనా పరిస్థితి మారుతుందని భావించినా ఆశించిన ఫలితం కనిపించడం లేదు. ఆదిలాబాద్ జిల్లాకు తలమానికంగా ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) మూతపడి దశాబ్దాలు గడిచినా తెరిపించడంలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తోంది. తాజాగా అక్కడి పరికరాలను తుక్కు కింద వేలం వేస్తూ నిర్ణయం తీసుకోవడం జిల్లావాసులను మరింత నిరాశకు గురిచేసింది. వీటితో పాటు మంచిర్యాల ప్రాంతంలో ఉన్న సిరామిక్స్ పరిశ్రమలు సైతం సంక్షోభం దిశగా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని మూతపడగా..మరికొన్ని అదే బాటలో పయనిస్తున్నాయి. జిల్లాలో ఆహార శుద్ధి పరిశ్రమలు నెలకొల్పుతామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికీ స్థల సేకరణలోనే అధికారులు నిమగ్నమయ్యారు. నిర్మల్ జిల్లాలో ఆయిల్‌ఫాం పరిశ్రమను ఏర్పాటుచేస్తామని ప్రభుత్వం ప్రకటించినా కార్యరూపం దాల్చడం లేదు. జిల్లాలో టమాట పంట అధికంగా సాగవుతున్న దృష్ట్యా దీని అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. కానీ ప్రభుత్వ ప్రతిపాధనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

అనుబంధ పరిశ్రమలకు లభించని మోక్షం..!

జిల్లాలో పత్తి, సోయా, టమాట తదితర పంటలు అధికంగా సాగవుతుంటాయి. ముఖ్యంగా ప్రధానంగా పండించే పత్తికి అనుబంధంగా జిన్నింగ్ మిల్లులు అవతరించాయి. ముఖ్యంగా ఇక్కడి పత్తి పంట మేలు రకం కావడంతో వివిధ మార్కెట్లలో మన పత్తికి డిమాండ్ ఉంటుంది. కానీ ప్రభుత్వాల ప్రోత్సాహకాలు లేకపోవడంతో పలు జిన్నింగ్ మిల్లులు మూతపడటం ఆందోళనకరంగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో 78 జిన్నింగ్



మిల్లులు ఉండగా ఇందులో 27మిల్లులు ఇటీవల మూతపడటం పారిశ్రామిక రంగం పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. ముఖ్యంగా జిల్లాలో మాంగనీసు, సున్నపురాయి, కోల్ తదితర ఖనిజ నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. జిల్లాలో లభించే మాంగనీసు ఖనిజం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కానీ ఇక్కడ మాత్రం వాటి అనుబంధంగా ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటుచేయడం లేదు. గతంలో టమాట అనుబంధ ఫ్యాక్టరీలను ఏర్పాటుచేస్తామని ప్రభుత్వం హామీనిచ్చినా కార్యరూపం దాల్చడం లేదు. దీంతో రైతులు ఒక్కోసారి టమాటలకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో రోడ్లపై పడేయాల్సి వస్తోంది. వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలు లేకుండా పోయాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల మీదుగా హైదరాబాద్- నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటుచేస్తామని ప్రభుత్వం పేర్కొంది. కానీ ఈ ప్రక్రియ కేవలం మాటలకే పరిమితమవుతోంది. ఫలితంగా యువతకు ఉపాధి లేక నిరుద్యోగం మరింత పెరిగేందుకు కారణమవుతోంది. కాగజ్‌నగర్‌లో పేపర్ మిల్లు పున ప్రారంభం జరిగినా.. అందులో స్థానికులకు ఉద్యోగాలు లభించకపోవడంతో వారిలో నిరుత్సాహం ఎదురవుతోంది. జిల్లాలో ఇలా ఒకటి, రెండు పరిశ్రమలు మినహా .. కొత్తగా వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో ఇప్పటికే అభివృద్ధిలో వెనుకబడి ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మరింత వెనుకబాటుకు గురవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చరిత్రకు సాక్ష్యం.. గోండు రాజుల కోట..

- ఉట్నూర్ కేంద్రంగా పాలన
- 18వ దశాబ్దంలో కోట నిర్మాణం
- కోటను పాలించిన హన్మంతరాయుడు

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీల గత వైబావినికి చిహ్నాంగా ఉన్న గోండు రాజుల కోట ఉట్నూర్ కేంద్రంగా వారి పాలనకు చెదరని గుర్తుగా ఉంది. కాలగర్భంలో కలిసిపోయిన చరిత్రకు సాక్షిగా నేడు మన కండ్ల ఎదుట నిలిచింది ఈ కోట. ఆదిలాబాద్ జిల్లా అనగానే గోండు జాతి గుర్తుకు రాకమానదు. గతంలో మాట ఎలా ఉన్న కుమురం భీం సంఘటనతో గుర్తుకు వస్తుంది. సామ్రాజ్యాధినేతల గాధలను తన శిథిల గర్భంలో దాచుకున్న ఈ కోటను 18వ దశాబ్దంలో ఉట్నూర్‌లో గోండు జాతికి చెందిన హన్మంతరాయుడు తన అనుచరులతో నిర్మించి మంత్రులు, సేనాధిపతులతో సైన్యాంతో సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అడవులను శాసించిన గోండు రాజుల పాలనకు సాక్షిగా ఈ కోట నిలిచి ఉంది. ఈ కోట గురించి బహ్య ప్రపంచానికి తెలిసింది చాలా తక్కువ. నిజాం ప్రభుత్వం సత్సంబంధాలు కొనసాగిస్తూ ఏజెన్సీ ప్రాంతాన్ని పరిపాలించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.

నాటి వైభవానికి ప్రతీక..

అడవులే ఆటపట్టుగా మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న గోండు జాతి గతంలో కోటలు నిర్మించుకుని రాజ్యపాలన సాగించడానికి ఈ కోట సజీవ సాక్ష్యం. ఉట్నూర్‌లో పాత ఉట్నూర్ సమీపంలో ఉన్న గోండు రాజుల కోటను కేంద్రంగా పెట్టుకోని హన్మంతరాయుడు నైజాంతో సత్సంబధాలు ఏర్పరుచుకోని రాజ్యపాలన కోనసాగించాడు. కాగా అప్పట్లో అరాచకాలను సృష్టిస్తు బందిపోట్ల బారి నుండి గోండులను రక్షించి హన్మంతనాయుడు వారి ఆదరణను చూరగోన్నాడు. ఈ కోటను హన్మంతరాయుడు నిర్మించినట్లు ఆధారాలు చెబుతున్నాయి. అయితే హన్మంతరాయుడు మరణానాంతరం ఆయన భార్య పరిపాలన సాగించగా ఆ సమయంలో గోండులకు నైజాం ప్రభుత్వంతో సంబంధాలు బెడిసికోట్టాయి. దాంతో నైజాం ప్రభుత్వం గోండుల కోటపై దాడి జరిపింది. ఓటమి చవిచూసిన గోండు జాతి అడువుల్లోకి పారిపోయి తలదాచుకుంది. హన్మంతరాయుడు తమ్ముడు జగపతిరావ్ ఉట్నూర్ సమీపంలోని లక్కారం గ్రామంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోని గోండుల సంక్షేమానికి పాటుపడ్డాడు. ఆయన మనుమడు సీతాగోంది ఆత్రం దేవ్‌షా (రాజదేవ్‌షా) కుటుంబం ప్రస్తుతం లక్కారంలో నివసిస్తున్నారు. రాజదేవ్‌షా గతంలో ఉట్నూర్ సమితి అధ్యక్షునిగా, శాసన సభ్యునిగా పనిచేశారు. ఆయన కూడా దివంగతులయ్యారు. నమ్ముకున్న వారికి ప్రాణాలైన ఇవ్వడానికి సిద్దంగా ఉండే లక్షణం గోండు జాతిలో ఇప్పటికి ఉంది. ఈ కోట లోపల ఉన్న సొరంగ మార్గాలు కుంటాల ప్రాంతానికి అక్కడి నుంచి నిర్మల్ కోట వరకు ఉన్నట్లు స్థానికుల కథనం. కోట లోపల నిర్మించిన కోనేరు గోండులకు ఆ కాలంలో ఎంతో పవిత్రమైనది. అప్పటి కోనేరు ఇప్పటికి చెక్కు చేదరకుండ ఉంది. కోట చూట్టు నిర్మించిన ప్రహారి నిర్మాణాలు చేపట్టి ఉంది. ప్రస్తుతం ప్రహారం కూలిపోయయి. కోటలో శత్రువులు ఎవరూ ప్రవేశించకుండా తవ్విన కందకాలు మూసుకపోయయి. ఈ కోటలో అక్రమ తవ్వకాల వల్ల కోట నానాటికి శిథిలమవుతోంది. నాగరికత ప్రపంచం నుంచి వెలివేసినట్టుగా ఉన్న గోండుల కోట



గురించి ప్రభుత్వం శ్రద్ద తీసుకోని గత వైభవానికి చిహ్నాంగా ఉన్న కోటను రక్షించ వలసిన అవసరం ఎంతైన ఉందని ఆదివాసీ సంఘాలు కోరుతున్నాయి. ఈ కోటను ఐటీడీఏ అధికారులు పర్యాటక కేంద్రంగా మార్చి గోండుల సాంప్రదాయ మ్యూజియం ఏర్పాటు చేసినట్టైతే గోండుల చరిత్ర సజీవంగా నిలిచిపోతుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

జవహర్ నవోదయ విద్యాలయం

జవహర్ నవోదయ విద్యాలయం


ప్రతి విద్యార్థికి ల్యాప్‌టాప్‌తో విద్యాబోధన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గ్రామీణ విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయం ఒక వరంగా మారింది. కార్పోరేట్ స్థాయిలో పేద గ్రామీణ విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు ఏర్పాటయిన జవహర్ నవోదయ విద్యాలయాలు మంచి ఫలితాలనందిస్తున్నాయి. గ్రామీణ విద్యార్థులకు ఉచితంగా కార్పోరేట్ విద్యను అందించేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటయిన ఈ విద్యాలయాలలో కేవలం ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు కల్పిస్తుండడం, వీటిలో విద్యను అభ్యసించిన విధ్యార్థులు భవిష్యత్తు కాలంలో ఉన్నత స్థాయికి ఎదుగుతుండడంతో ఈ విద్యాలయాలు మంచి ప్రాచుర్యాన్ని సంపాదించాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదటి నుండి కాగజ్‌నగర్ పట్టణంలో ఉన్న ఈ జవహర్ నవోదయ విద్యాలయం కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చింది.

1987లో ప్రారంభం

1986 జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి కేంద్ర ప్రభుత్వంచే ఈ విద్యాలయాలు ప్రారంభించబడ్డాయి. దేశంలోని 28 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలలో విస్తరించి ఉన్న నవోదయ విద్యాలయాలను మన రాష్ట్రంలో జిల్లాకు ఒకటి చొప్పున కేటాయించారు. ఆదిలాబాద్ జిల్లా నవోదయ విద్యాలయాన్ని 1987-88 విద్యాసంవత్సరంలో కాగజ్‌నగర్‌లో నెలకొల్పారు. ప్రారంభంలో స్థానిక ఆర్ఆర్ఓ కాలనీలో ఈ విద్యాలయాన్ని నెలకొల్పారు. 1997-98లో ఈ విద్యాలయానికి స్థానిక త్రిశూల్‌పహాడ్‌పై స్థలం కేటాయించగా ఆధునాతన భవనాలను నిర్మించి అందులోకి విద్యాలయాన్ని తరలించారు. ప్రస్తుతం 30 ఎకరాల విస్తీర్ణంలో ఈ విద్యాలయం విస్తరించి ఉంది. విద్యార్థుల తరగతి గదులతో పాటు పరిపాలనా భవనాలు, వసతిగృహాలను ఆధునాతన సౌకర్యాలతో నిర్మించారు. విద్యార్థులు ఆడుకోవడానికి వీలుగా సువిశాలమైన క్రీడా మైదానం, ఒకేసారి 320 మంది విదార్థులు భోజనాలు చేసే వీలుగా భోజనాలయం నిర్మించారు. విద్యార్థులకు సౌకర్యంగా లైబ్రరీ, రీడింగ్ రూం, కంప్యూటర్ ల్యాబ్‌లను నిర్మించారు.

30 ఎకరాల్లోని ప్రశాంత వాతావరణంలో విస్తరణ

ఆరో తరగతిలో ప్రవేశం

ఈ విద్యాలయంలో ప్రతి ఏటా ఆరో తరగతిలో విద్యార్థులను చేర్చుకుంటారు. ఇందుకు గాను జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రతి ఏటా ప్రవేశపరీక్ష నిర్వహిస్తుంది. మొత్తం విద్యాలయంలో 80 సీట్లను ఈ ప్రవేశపరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. 80 సీట్లకు ప్రతి ఏటా సుమారు పది వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటారు. ఇందులో ప్రవేశపరీక్షలో అద్భుత ప్రతిభ కనబర్చిన 80 మంది విద్యార్థులను మాత్రమే ఎంపిక చేసి ప్రవేశాలు కల్పిస్తారు. 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థులు ఈ విద్యాలయంలో పూర్తి ఉచితంగా విద్యాభ్యాసాన్ని కొనసాగించవచ్చు. ప్రతి తరగతికి రెండు సెక్షన్‌లు ఉంటాయి. ప్రతి సెక్షన్‌లో 40 మంది విద్యార్థులు ఉంటారు. విద్య, భోజనము, యునిఫాం, పుస్తకాలు, ఆవాస వసతులు ఉచితమే అయినా 9 నుండి 12వ తరగతి వరకు కనీస నెలసరి ఫీజుగా రూ. 200 చెల్లించాలి. ఈ ఫీజు చెల్లింపు నిబంధన బాలికలకు, ఎస్సీ, ఎస్టీ, దారిద్ర్య రేఖకు దిగువగా ఆదాయం కలిగిన వారికి, అంగవైకల్యం కలిగిన వారికి వర్తించదు. గ్రామీణ ప్రాంత ప్రతిభావంతులైన విద్యార్థులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉన్నత ప్రమాణాలతో కూడిన ఆధునాతన విద్యను అందించడంతో పాటు వారిలో ఉత్తమ సంస్కృతి విలువలను పెంపొందించడం, పర్యావరణం పట్ల సదవగాహన, సాహసోపేత కృత్యాలతో పాటు క్రీడలు, వ్యాయామ విద్యలో సమున్నత శిక్షణ ఇవ్వడం నవోదయ విద్యాలయాల ముఖ్య ఉద్దేశ్యం. అంతేకాకుండా హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో తగిన నైపుణ్యాన్ని పెంపొందించడం, వలస విద్యా (మైగ్రేషన్) విధానం ద్వారా హిందీ రాష్ట్ర విద్యార్థులను హిందీయేతర రాష్ట్రాలకు, హిందీయేతర రాష్ట్రాల నుండి హిందీ రాష్ట్రాలకు పంపించి జాతీయ సమైక్యతాభావాన్ని పెంపొందించడం ముఖ్య ఉద్దేశ్యాలుగా ఈ విద్యాలయాలు కొనసాగుతున్నాయి.

విద్యాలయం ప్రత్యేకతలు

సువిశాలమైన క్రీడా ప్రాంగణంతో పాటు తగినంత ఆట స్థలం, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో ఆడేందుకు అవసరమైన క్రీడా పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఇద్దరు సుశిక్షితులైన వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీలలో రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో ఈ విద్యార్థులు రాణిచారు. చిత్రలేఖనంలో కూడా ఈ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. సంగీతం, నృత్యంలలో ప్రత్యేక శిక్షణ ఇస్తుంటారు. అత్యాధునికమైన కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు ప్రతి విద్యార్థికి ఒక ల్యాప్‌టాప్ అందుబాటులో ఉంటుంది. జాతీయ స్థాయి సైన్స్, మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌లో ఈ విద్యార్థులు పాల్గొంటున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత ఐఐటి/ఎన్ఇఇలో శిక్షణ ఇస్తారు. శాంసంగ్ స్మార్ట్‌రూంతోపాటు ఆధునాతన సాంకేతిక విద్య పరిజ్ఞానంతో కూడిన విద్యను ఈ విద్యాలయంలో అందిస్తారు.

వన్నె తగ్గని వార సంతలు


ఇచ్చోడ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పల్లెవాసుల జీవితాలకు వార సంతలతో ప్రత్యేక అనుబంధం ఉంది. నేటికీ గ్రామీణులు వార సంతలపై ఆధారపడి వారానికి సరిపడా వస్తువులు సమకూర్చుంటున్నారంటే అతిశయోక్తికాదు. ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు వార సంతలతో విడదీయరాని అనుబంధం పెనవేసుకొని ఉంది. రవాణా వ్యవస్థ అంతగా అభివృద్ధి చెందని ఆ రోజుల్లో సంతలు ప్రజల అవసరాలు తీర్చేవి ఉండేవి. రానురాను వాటి అవసరం లేకుండా మార్కెట్ విస్తరించింది. ప్రస్తుతమైతే ప్రత్యేకించి పట్టణవాసులకు చేతిలో ఓ స్మార్ట్ ఫోనుంటే చాలు మంచం దిగకుండానే కావాల్సిన సరుకులను ఇంటికి తెప్పించుకోవచ్చు. అయితే నాణేనానికి ఒక వైపు మాత్రమే. నేటికీ ఏరోజుకారోజు, వారానికి సరిపడా మాత్రమే సరుకులు కొనుగోలు చేసుకొని జీవించే ప్రజలు అన్ని ప్రాంతాల్లో ఉన్నారు. ఇప్పుడొచ్చిన ఈ మాల్స్, గోల్స్ వారికేమీ తెలియవు. వారికి తెలిసిందల్లా వార సంతలు, చిల్లర కొట్టులే. ఇలా ఆదిలాబాద్ లాంటి వెనుకబడిన ప్రాంతాల్లో వార సంతలకు నేటికీ ఆదరణ తగ్గలేదు. ప్రజల జీవనవిధానంలో భాగంగా ఉన్నాయి. దశాబ్దాలు గడిచినా, షాపింగ్‌మాల్, సూపర్‌బజార్‌లకు దీటుగా గ్రామీణ సంతలు నూతన రూపురేఖలు సంతరించుకుంటున్నాయి. ప్రజల అవసరాలను తీర్చుతున్నాయి. అంగడిబజార్లలో కూరగాయల నుంచి మొదలుకొని అన్ని రకాల గృహోపకరణాలు, నిత్యావసర సరుకులు, పెండ్లిండ్లు, పేరంటాలకు, వివిధ రకాల వేడుకలకు అవసరమైన వస్తువులు ఒకేచోట అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి. ఇలా గ్రామీణులు నానాటికీ ఈ వారసంతలను ఆదరిస్తూ వస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు సైతం సంతలో వారికి అవసరమైన వస్తువులను సరసమైన ధరలకు అందుబాటులో ఉంచుతున్నారు. డివిజన్, మండల కేంద్రాలతో పాటు పెద్ద పెద్ద గ్రామ పంచాయతీల ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసే వార సంతల్లో రైతులు, కూలీలకు అవసరమైన వస్తువులు దొరుకుతున్నాయి. ప్రజలు వారానికి సరిపడా వస్తువులు ఒకేసారి కొనుగోలు చేస్తుంటారు. గతంలో అంగడికి వచ్చేవారు ఇంటి నుండి ధాన్యాన్ని తీసుకొచ్చి వాటిని విక్రయించి తమకు వారానికి సరిపడా సరుకులు కోనుగోలు చేసేవారు. ప్రస్తుతం పరిస్థితి మారింది. డబ్బులు చెల్లించి వస్తువులను కొనుగోలు చేస్తున్నారు.

ఏడు రోజులు..ఏడు వారసంతలు.. ఏజెన్సీ ప్రత్యేకత...

ఏజెన్సీలోని ప్రజలు ఏదీ కొనాలన్నా వార సంతలే ముఖ్యం. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉంది. వారంలో ఏడు రోజులుంటే ఏడు వార సంతలు కూడా ఉన్నాయి. ఆదివారం ఉట్నూర్, కెరమెరి, సోమవారం ఇంద్రవెల్లి, మంగళవారం శ్యాంపూర్, బుధవారం నార్నూర్, ముత్నూర్, తాడిహత్నూర్, దంతన్‌పెల్లి, గురువారం జైనూర్, శుక్రవారం సిర్పూర్(యు) ఎక్స్‌రోడ్, శనివారం హస్నాపూర్‌లో వారసంతలు ఏర్పాటు చేస్తారు. ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజనులు దశాబ్దాలుగా వారికి కావల్సిన ఆహార వస్తువుల నుండి శుభకార్యాల వరకు కావల్సిన వస్తువులను ఈ వార సంతల్లో కొనుగొలు చేసుకుంటారు. ఇందులో జైనూర్ వారసంత ఆదివాసులకు పెద్ద వారసంతకు పేరుగాంచింది. జైనూర్ మండలం పరిధిలో ఎక్కువగా ఆదివాసీ గూడేలు, తండాలు ఉన్నాయి. ఆ తర్వాత ఏజెన్సీలో ఆదివాసీలకు ప్రత్యేక వారసంత అంటే ఉట్నూర్ వారసంతనే. ఏడు వార సంతల్లో కెరమెరి, జైనూర్, ఎక్స్‌రోడ్ వారసంతలో పశువుల సంత కూడ నిర్వహిస్తారు. ఆదివాసీ గిరిజనులకు కావల్సిన సరుకులను వ్యాపారులు సంతల్లో అందుబాటులో ఉంచుతారు. గిరిజనులు పెళ్లి వస్తువులతో పాటు దుస్తులు, పండగలకు కావాల్సిన సామాగ్రి తదితర వాటిని వార సంతల్లో కొనుగోలు చేసేందుకు వస్తుంటారు.

ఉట్నూర్ వారసంత ప్రత్యేకత ఇది...

ఏజెన్సీ ప్రాంతానికి ఉట్నూర్ తలమానికం. ఇక్కడ నిర్వహించే వారసంతకో ప్రత్యేకత ఉంది. ఏజెన్సీ మారుమూల ప్రాంతాల నుండి కూరగాయలు, పండించిన ధాన్యాలు విక్రయించేందుకు వ్యాపారులు ఉట్నూర్ వారసంతకు వస్తుంటారు. పెళ్లి, శుభకార్యాలకు కావాల్సిన ప్రతి వస్తువు ఉట్నూర్ వారసంతలో లభించడం ప్రత్యేకత. ఇక్కడి వారసంతలో జిల్లాలో ఎక్కడా దొరకని తాజా కూరగాయలు దొరుకుతాయి. ఆదివారం వారసంత ఉందంటే చాలు ఇక్కడి కొనుదారుల కంటే బయట వ్యాపారులు ఎక్కువగా వస్తుంటారు. ఇక్కడ కొనుగోలు చేసిన కూరగాయలను వ్యాపారులు ఇతర ప్రాంతాల మార్కెట్‌లో అమ్ముకుంటారు. ఈ సంతలో ధరలు కూడా ప్రజలకు అందుబాటులోనే ఉంటాయి. పొలాల పండగ సమయంలో ఇక్కడి వారసంత గిరిజనులతో సందడిగా మారుతుంది. దీంతో పాటు గిరిజనులు జరుపుకునే ప్రతి పండగకు ఇక్కడి వారసంత కిక్కిరిసిపోతుంది. పెండ్లి సీజన్‌లోనైతే వారసంత కొత్త శోభను సంతరించుకుంటుంది.

నాడు ఎద్దులపురం నేడు ఆదిలాబాద్..

ప్రస్తుతం ఆదిలాబాద్ ఒకప్పుడు ఎద్దులపురంగా ఉండేది. ఎద్దులపురం నుండి క్రమేపి ఎదులపురం ఆ తర్వాత ఆదిలాబాద్‌గా మార్పు చెందింది. ఈ ప్రాంతం ఒకప్పుడు బీజాపూర్ రాజ్యంలో ఉండేది. ఆ రాజ్యానికి రాజు అలీఅహ్మద్‌షా. ఆయన హత్యకు గురైన తర్వాత ఆయన తొమ్మిదేండ్ల కుమారుడే రాజుగా నియమింపబడ్డాడు. కానీ వ్యవహారాలన్నీ తండ్రి వద్ద మంత్రిగా ఉన్న మహారాష్ట్ర వాసి చూసేవాడు. దానికి కృతజ్ఞతగా ఆ బుల్లి రాజు ఇబ్రహీం ఆదిలాషా ఈ ప్రాంతాన్ని ఆ మంత్రికి జాగీర్దారుగా ఇచ్చాడు. దీనికి ఆ మంత్రి ఆదిల్‌షా బాద్(ఆదిలాషా-ఆబాద్) (ఆబాద్ అంటే నివాసం ఉండే ప్రాంతమని పేరు) పెట్టారు. కాలక్రమంలో ఆ పేరే ఆదిలాబాద్‌గా మారింది. పూర్వం ఈ ప్రాంతంలో ఎద్దుల వ్యాపారం ఎక్కువగా జరిగేది. దీంతో ఎద్దులపురంగా ఆ తర్వాత ఎదులాపురం అని పిలిచేవారు. కాలక్రమేణ రూపాంతరం చెంది ఎదులాబాద్. ఆ తర్వాత ఆదిలాబాద్‌గా మారింది. ఏదేమైనా ఆదిలాబాద్ జిల్లాలో పశువుల అంగళ్లు నేటికీ కొనసాగుతున్నాయి. పశువుల సంఖ్య నాటితో పోల్చుకుంటే తగ్గినా ప్రధానంగా జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్, ఇచ్చోడ ప్రాంతాల్లో నేటికీ పెద్ద ఎత్తుననే పశువుల సంతలు కొనసాగుతున్నాయి. వీటితో పాటు బేల మండల కేంద్రంతో పాటు సాంగిడి గ్రామంలో ఎద్దుల అంగడి నిర్వహిస్తుంటారు. ప్రత్యేకంగా దసరా, దీపావళి పండగల సీజన్‌లో ఎద్దుల క్రయవిక్రయాలు పెద్ద సంఖ్యలో జరుగుతుంటాయి. ఆదిలాబాద్ సరిహద్దు మహారాష్ట్రలోని ఘాటంజి, పాండ్రకవడ పట్టణాల్లోనూ పశువుల సంతలు నిర్వహిస్తుంటారు. ప్రధానంగా పశువుల సంతలు ఎక్కడైన శని, ఆది, సోమ వారాల్లో జరుగుతుంటాయి. పశు సంతతి తగ్గుతున్న నేపథ్యంలో పశువుల ధరలు భారీగా పెరిగాయి. 10, 20 సంవత్సరాలతో పోల్చుకుంటే ధరలు రెట్టింపయ్యాయి. ఒక ఎద్దుల జత రూ.లక్ష వరకూ పలుకుతుండడం బట్టి చూస్తే డిమాండ్ ఏ మేర ఉందో అర్థమవుతోంది. ఎద్దుల వయస్సును బట్టి ధర పలుకుతుంది.


ఉట్నూర్

పశువు సంతకు పేరుగాంచిన ఇచ్చోడ ....

ఇచ్చోడ మండల కేంద్రం సైతం పశువుల సంతకు పేరుగాంచింది. ప్రతి సోమవారం వారసంతతో పాటు పశువుల సంత జరుగుతుంది. మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు సమీపంలో పశువుల సంత నిర్వహిస్తుంటారు. సంతకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానే కాకుండా నిజామాబాద్, నందిపేట, ఆర్మూర్, మహారాష్ట్ర రాష్ట్రం నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి వస్తుంటారు. సంతలో ఎద్దులు, ఆవులు, మేకలు, గొర్రెల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. పంచాయతీ ఆధ్వర్యంలో సంతకు వేలం పాట నిర్వహించి వ్యక్తులకు అప్పగిస్తుంటారు. మేకల సంతకు రూ.3లక్షలకు పైగానే వేలం పలుకుతుండడం చూస్తుంటే ఎంత పెద్ద ఎత్తున వ్యాపారం జరుగుతుందో అర్థమవుతోంది. పశువుల సంతతో పాటు వార సంతకూ ఈ ప్రాంతంలో ప్రాధాన్యత ఉంది. ఇచ్చోడ ఇటీవల కాలంలో అభివృద్ధి దిశగా అడుగులేస్తోంది. జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్ తర్వాత ఇచ్చోడ ముఖ్యమైన పట్టణంగా మార్పు చెందుతోంది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఇచ్చోడ వ్యాపార కేంద్రంగా ఉంది. ఈ ప్రాంత వాసులు అనాదిగా వార సంతకు అలవాటు పడ్డారు. వారానికి సరిపడా అన్ని రకాల వస్తువులు కొనుగోలు చేసుకుంటారు. వ్యాపారులు సైతం దూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఇచ్చోడతో పాటు ప్రతి మంగళవారం బోథ్, శనివారం నేరడిగొండ, శుక్రవారం గుడిహత్నూర్, గురువారం బజార్‌హత్నూర్, బుధవారం సొనాల ప్రాంతాల్లో వారసంతలు జరుగుతున్నాయి. వ్యాపారులు ప్రతి రోజు రోజుకోచోటకు చేరుకొని అక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారు.

సంతలకు సౌకర్యాలలేమి..

సంతల ద్వారా గ్రామ పంచాయతీలకు ప్రతి సంవత్సరం లక్షల్లో ఆదాయం వస్తోంది. కానీ సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంతలకు ప్రత్యేక స్థలాలు అంటూ లేవు. ప్రధాన కూడళ్లలో రోడ్లల కిరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకొని వస్తువులను విక్రయిస్తుంటారు. వర్షాకాలంలో అవస్థల మధ్య ఈ సంతలు కొనసాగుతున్నాయి. అడుగు తీసి అడుగేయడానికి వీల్లేకుండా బురదలోనే వినియోగదారులు వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వ్యాపారులు సైతం అతి కష్టం మీద దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తుంటారు. పశువుల సంతలకు సైతం చాలా కాలంగా సౌకర్యాల లేమి వెంటాడుతోంది. పశువులకు కనీసం తాగు నీటి సౌకర్యాలు లేవు. పశువులను వాన, ఎండలోనే ఉంచాల్సిన దుస్థితి ఉంది. వ్యాపారులు సైతం ఎండ, వర్షంలోనే కొనుగోలుదారుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. వేలం పాట ద్వారా సంత నిర్వహణను దక్కించుకున్న వ్యక్తులు పశువుల జోడికి రూ.400 వసూలు చేస్తుంటారు. కూరగాయల మార్కెట్ సైతం కూరగాయలు అమ్ముకోవడానికి సదరు వ్యాపారులు, రైతులు రూ.100 చెల్లిస్తుంటారు. వేలం దక్కించుకున్న వ్యక్తి ఇలా వారం వారం డబ్బులు వసూలు చేస్తుంటాడు. పంచాయతీకి మాత్రం సంవత్సరానికి ఒకసారి వేలంలో పలికిన ధరను చెల్లించాల్సి ఉంటుంది. ఒక ఇచ్చోడ వారసంతకే సంవత్సరానికి రూ.6లక్షల ఆదాయం వస్తోందని అంచనా. ఇలా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వందల సంఖ్యలో వార సంతలు జరుగుతుంటాయి. అంటే ఈ సంతల ద్వారా కోట్లలో వ్యాపారం సాగుతోందని తెలుస్తోంది. ఈ వారసంతలకు ప్రత్యేక స్థలాలు కేటాయించి షెడ్లు ఏర్పాటు చేస్తే వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

షాపింగ్‌మాల్స్, సూపర్‌బజార్లు పేరేదైనా నేటి ఆధునిక జీవితానికి అలవాటైన షాపింగ్. ఒకప్పుడు పెద్దపెద్ద పట్టణాలకే పరిమితమైన షాపింగ్‌మాల్స్ ప్రస్తుతం చిన్న పట్టణాలకు సైతం విస్తరించాయి. ఇలా వెళ్లి అలా మనకవసరమైన వస్తువులు తెచ్చుకునేలా ఇవి ఉన్నాయి. అయితే మరోపక్క అనాదిగా క్రయవిక్రయాలకు పేరొందిన సంతలకు నేటికీ ఆదరణ ఏమాత్రమూ తగ్గలేదు. పట్టణ వాతావరణం అంతగా లేని మారుమూల ప్రాంతాలు మొదలుకొని, ఆనవాయితీగా వస్తున్న ప్రాంతాల్లో వీటి ప్రాభవం చెక్కుచెదరలేదు. గ్రామీణుల జీవితాలతో పెనవేసుకున్న వార సంతలు ..


ఆదిలాబాద్


ఇంద్రవెల్లి

ఎనిమిదవ వార్షికోత్సవ శుభాకాంక్షలు



వ్యవసాయ రంగంలోని నూతన మెలకువలను రైతులకు తెలుపుతూ, ప్రభుత్వం అందిస్తున్న సమాచారాన్ని పాఠకులకు తెలియజేస్తూ, నూతన ఒరవడికి కృషి చేస్తున్న నవతెలంగాణ దిన పత్రికకు ఎనిమిదో వార్షికోత్సవ శుభాకాంక్షలు

- వెంకటేష్ గౌడ్, బీదరెల్లి పీఏసీఎస్ చైర్మెన్



సమాజంలో కొన్ని పత్రికలే ప్రజల వైపు, పత్రిక రంగంలో సమాజంలో కొన్ని పత్రికలు వారి వారి రాజకీయ ప్రయోజనాల కోసం ఏదో ఒక రాజకీయాల్లో పార్టీ కోసం వార్తలు రాస్తున్నాయి. ఏదో ఒక వర్గం కోసం పనిచేస్తున్నాయి. వాటి మాదిరిగా కాకుండా నవతెలంగాణ పత్రిక మాత్రం ప్రధానంగా ప్రజల సమస్యలు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, రైతుల పక్షాన వార్తలు రాస్తుంది. రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల కోసమే నవతెలంగాణ పత్రిక పని చేస్తుంది. పత్రిక ప్రజలలో మరింత విస్తరించాలి.

- షేక్ షాకిర్, 8వ వార్డు సభ్యులు
సీపీఐ మండల సహాయ కార్యదర్శి బోథ్

రాజకీయాల్లో మహిళ రిజర్వేషన్లు అమలు చేయాలి

- కాంగ్రెస్ పార్టీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రభుత్వాలు మహిళలకు 33శాతం రిజర్వేషన్లు రాజకీయాల్లో అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ స్పష్టం చేశారు. మహిళ రిజర్వేషన్లపై ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. మహిళలను రాజకీయాల్లో రాణించకుండా పాలక పార్టీలు అడ్డుకుంటున్నాయని అన్నారు. ఎన్నికల్లో ఓటర్లలో మహిళ ఓట్లు కూడా సగా భాగమని అన్నారు. కానీ ఎక్కడ కూడా మహిళలను రాజకీయా రంగాలలో అడ్డుకట్ట వేస్తున్నారని ఆరోపించారు. మహిళ నాయకులను ఎదగనీయకుండా రిజర్వేషన్లు తుంగలో తొక్కి కేవలం ఎన్నికల్లో ప్రచారంలో భాగస్వాములు చేసి ఓట్లను వేసేలా చేస్తున్నారని అన్ని రాజకీయ పార్టీలకు ఆమె ప్రశ్నించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో అధికార పార్టీ మహిళకు కాకుండా టికెట్‌ను పురుషులకు ఇచ్చిందని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం ఆసిఫాబాద్ నియోజకవర్గానికి మాత్రమే మహిళకు టికెట్ కేటాయించారని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 11 సార్లు అసెంబ్లీ ఎన్నికల జరుగగా ఇందులో 3 సార్లు మాత్రమే మహిళ అభ్యర్థులకు అవకాశం వచ్చిందన్నారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లలో 45 శాతంపైగా మహిళ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల్లో గెలుపులో మహిళ ఓట్లు కూడా కీలకమేన అన్నారు. కానీ రాజకీయ పార్టీలు సైతం మహిళ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. గతంలో అనేక లోకల్ బాడీ ఎన్నికల్లో మహిళకు రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో ఇటీవల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల పేర్లు ప్రకటించిన విషయం అందరికి తెలిసిందే. కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులు ప్రకటనలో మహిళకు స్థానం కల్పించాలని కోరారు.

నవతెలంగాణ దిన పత్రికకు ఎనిమిదో వార్షికోత్సవ శుభాకాంక్షలు



కార్మిక, కర్షక, బడుగు బలహీన వర్గాల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుపుతూ వాటి పరిష్కారానికి దిక్సూచిగా మారిన నవతెలంగాణ దినపత్రికకు, సిబ్బందికి, యజమాన్యానికి, ఎనిమిదో వసంతంలోకి అడుగిడిన సందర్భంగా వార్షికోత్సవ శుభాకాంక్షలు

- పెద్ద కొండ్రు సుధాకర్‌రెడ్డి
మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు



ప్రస్తుతం పత్రికా రంగంలో తనదైన నిబద్ధతతో ఎదుర్కొంటూ నిలదొక్కుకుంటూ నవతెలంగాణ సమాజానికి కలకాలం విశ్లేషణాత్మక విశ్వసనీయ వార్త కథనాలతో తెలంగాణ ప్రజానీకానికి మరింత చైతన్యం పరుస్తూ ముందుకు సాగాలని కోరుకుంటూ నవతెలంగాణకు 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

- పసుల చంటి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి



అనుక్షణం ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజల మన్ననలు పొందిన పత్రిక ప్రభుత్వానికి సమగ్రంగా నిజాయితీగా పనిచేస్తున్న నవతెలంగాణ పత్రికకు అభినందనలు నిజాలను నిర్భయంగా రాస్తూ, నిజాయితీకి మారుపేరుగా ఉన్నటువంటి పత్రిక ఏకైక పత్రిక నవతెలంగాణ పత్రిక అని చెప్పుకోవచ్చు నవతెలంగాణ వార్షికోత్సవ సందర్భంగా పాఠకులకు సిబ్బందికి ప్రత్యేక శుభాకాంక్షలు

- డాక్టర్ రాజనాల సంధ్యారాణి, జెడ్పీటీసీ బోథ్



ప్రజల ప్రయోజనాలే ధ్యేయంగా ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నవతెలంగాణ నిలుస్తుంది. ముఖ్యంగా కష్టజీవులు కార్మికుల పక్షాన నిలబడే ఏకైక పత్రిక పేరుగాంచింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తూ ప్రజల వాయిస్‌ను అందిస్తూ ఎనిమిదో వార్షికోత్సవంలో అడుగుపెడుతున్న నవతెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను.

- తుల శ్రీనివాస్ ఎంపీపీ,
ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు బోథ్



నవతెలంగాణ ప్రజల పక్షాన నిలుస్తోంది. తెలంగాణ ఆవిర్భావ అనంతరం రాష్ట్రంలో నవతెలంగాణ పేరుతో పత్రిక ప్రజల పక్షాన నిలుస్తుంది. నిరంతరం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా వార్తలు రాస్తూ, ప్రజల మన్ననలను అందుకుంటుంది. దిన దిన అభివృద్ధి చెందుతూ ప్రతి గడపగడపకు నవతెలంగాణ చేరాలని ఆకాంక్షిస్తూ, పత్రిక యజమాన్యానికి సిబ్బందికి 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

- చెల్లపల్లి సదానందం
సర్పంచ్ సొనాల, బోథ్

నవతెలంగాణ దిన పత్రికకు 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



అనుదినం ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజల సమస్యలను పరిష్కారమే ధ్యేయంగా అక్షరమాలికలను పాఠకులకు అందిస్తున్న నవతెలంగాణ దినపత్రికకు 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

- విజయరామారావు
బాసర సరస్వతి ఆలయ కార్యనిర్వాహణాధికారి

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ హామీని నెరవేరుస్తాం




నవతెలంగాణ-కడెం

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డేవేళ్లలో జరిగిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ హామీలు నెరవేరుస్తామని మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్, గొండుగూడ, పెత్తార్పు, సారంగాపూర్ గ్రామాలలో పర్యటించి గ్రామ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏడాదికి ఒక్కో కార్పొరేషన్‌కు రూ.750 కోట్లను మంజూరు చేస్తామని మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్ పేర్కొన్నారు. విద్యకి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి మండల కేంద్రంలో ఒక గురుకుల పాఠశాలను నెలకొల్పుతామన్నారు. కార్యక్రమంలో ముస్కు రాజు, రాజన్న, సుధాకర్, లక్ష్మణ్, కట్ల గంగన్న, భూషణ్, రమేష్, చాంద్ బాషా, శీను, రాజన్న, నర్సయ్య, చంద్రయ్య, రాజలింగు, కొమురయ్య పాల్గొన్నారు.



ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నవతెలంగాణ పత్రిక నిలుస్తుంది. ముఖ్యంగా మారుమూల గిరిజన, కష్టజీవులు, కార్మికులు, పక్షాన నిలబడే ఏకైక పత్రికగా పేరుగాంచింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తూ ప్రజల వాయిస్‌ను అందిస్తూ ఎనిమిదో వార్షికోత్సవంలోకి అడుగుపెడుతున్న నవతెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను.

- ఎలక రాజు బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బోథ్



సమస్యలపై అధికారులకు సమాచారం అందిస్తుంది. నార్నూర్ ప్రజలు పడుతున్న ఇబ్బందులపై నవతెలంగాణ దినపత్రిక కథనాలు రాస్తూ, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటుంది. పత్రిక మరింత ముందుకు సాగాలి. ఎప్పటికప్పుడు కథనాలు రాస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ నవతెలంగాణ దినపత్రిక వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు సిబ్బందికి ప్రత్యేక అభినందనలు

- కావల రమేష్ ఎంపీడీఓ, నార్నూర్ మండలం



నవతెలంగాణ ఎనిమిదో వార్షికోత్సవ శుభాకాంక్షలు నార్నూర్ అనుక్షణం ప్రజల పక్షాన నిలిచి ప్రజల మన్ననలు పొందుతూ పేద ప్రజల సమస్యలను ప్రభుత్వానికి సమగ్రంగా తెలియజేస్తూ నిజాయతీగా పని చేస్తున్న నవతెలంగాణకు అభినందనలు నిజాలను నిర్భయంగా రాస్తూ, నిజాయితీకి మారు పేరుగా ఉన్నటువంటి నవతెలంగాణ దినపత్రిక వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు సిబ్బందికి శ్రేయోభిలాషులకు ప్రత్యేక శుభాకాంక్షలు.

- బాధావత్ కళావతి ఉత్తం ఎంపీటీసీ, నాగల్ కొండ



ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నవతెలంగాణ నిలుస్తోంది. ముఖ్యంగా కష్టజీవుల, కార్మికులు, పేదల పక్షాన నిలబడే ఏకైక పత్రికగా పేరుగాంచింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తూ ప్రజల గొంతుకను అందిస్తూ ఎనిమిదో వసంతంలోకి అడుగుపెడుతున్న 'నవతెలంగాణ' మరింత దినదినాభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను.

- ముండే పాండు రంగ్
సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు ఇచ్చోడ



దశాబ్దాలుగా తెలుగు పాఠకులతో అనుబంధం పెంచుకున్న ప్రజాశక్తి, దాని ప్రతిరూపంగా వచ్చిన నవతెలంగాణ దినపత్రిక 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మరో వసంతంలోకి అడుగుపెట్టిన, జనం పత్రిక పాఠకులను మరింతగా ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నాను. శ్రామిక జన వారధిగా పేరొందిన 'నవతెలంగాణ' ముున్ముందు రోజుల్లో ప్రతిగడపకూచేరాలని కోరుకుంటున్నాను.

- పి. రమేష్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇచ్చోడ

నవతెలంగాణకు ప్రత్యేక అభినందనలు



ఉమ్మడి రాష్ట్రంలో ప్రజాశక్తి దినపత్రికగా పరిచయమై ప్రత్యేక రాష్ట్రంలో నవతెలంగాణగా అవతరించి ఎన్నో ఒడిదుడుకులను అధిరోహించి బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచి ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండ గట్టిన ఏకైక దినపత్రిక నవతెలంగాణ ఎనిమిదో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పత్రికా యాజమాన్యానికి, సిబ్బందికి అభినందనలు

- శివరాం ఎస్సై తాంసి

పక్షపాతం లేని పత్రిక నవతెలంగాణ



నవతెలంగాణ పత్రికను గత కొన్ని సంవత్సరాల నుంచి చదువుతున్నాను. ఎవరి పక్షాన ఉండకుండా ప్రజల పక్షాన నిలుస్తూ ఉంటుంది. ఈ పత్రిక ఎల్లప్పుడూ ప్రజా శ్రేయస్సు కోసం ఎల్లవేళలా కృషి చేస్తూ ఉంటుంది.

- వివేక్ ఏఓ, జైనథ్

నవతెలంగాణ ఎనిమిదో వార్షికోత్సవ శుభాకాంక్షలు



అనుక్షణం ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజల మన్ననలు పొందుతూ, పేద ప్రజల సమస్యలను ప్రభుత్వానికి సమగ్రంగా తెలియజేస్తూ నిజాయితీగా పనిచేస్తున్న నవతెలంగాణకు అభినందనలు. నిజాలను నిర్భయంగా రాస్తూ, నిజాయితీకి మారు పేరుగా ఉన్నటువంటి నవతెలంగాణ దిన పత్రిక వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు, సిబ్బందికి, శ్రేయోభిలాషులకు ప్రత్యేక శుభాకాంక్షలు.

-వాహబ్ అష్ఫాఖ్, ఫారెస్టు రేంజ్ అధికారి
ఇచ్చోడ(సిరిచెల్మ)

విద్యాభివృద్ధికి పెద్ద పీట



నవతెలంగాణ-బేల

గత ప్రభుత్వాలు విద్యను విస్మరించాయని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో విద్య అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మండలం కేంద్రంలోని కేజీబీవీ ఇంటర్మీడియట్ కాలేజీ భవన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. రెండు కోట్ల 30 లక్షల రూపాయలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు అనంతరం ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల గడిచినా అప్పటి ప్రభుత్వాలు స్త్రీ విద్యను విస్మరించాయని పేర్కొన్నారు. రోడ్లు లేక ఉన్నత విద్యకు సౌకర్యాలు కల్పించక అక్షరాస్యతకు దూరం కావాల్సిన పరిస్థితులు ఉండేవని తెలిపారు. అందుకు భిన్నంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహిళా విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ కేజీబీవీ కళాశాలలను ఒకే చోట ఉండి చదువుకునేలా ఒకటి నుండి ఇంటర్మీడియట్ వరకు పెంచడం జరిగిందన్నారు. ఉన్నత విద్య ద్వారానే సమాజంలో మార్పుతో పాటు ఆర్థిక అభివృద్ధిని సాధించవచ్చని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తూ దేశంలో లేని విధంగా కేవలం తెలంగాణలోనే వెయ్యి గురుకులాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యాపరంగా రాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రావుత్ మనోహర్, బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రె, ఒళ్లఫవార్ దేవన్న, సతీష్ పవార్, మస్కె తేజరావ్, మంగేష్ ఠాక్రె, కిషన్ వైద్య, తన్వర్‌ఖాన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు వట్టిపెల్లి ఇంద్రశేఖర్, తేజరావ్ వాడ్కర్, విపిన్ ఖోడే, సునీల్, డీఈఓ ప్రణీత, కేజీబీవీ ప్రత్యేక అధికారి నవీన పాల్గొన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 31 ఆగస్టు 2023

మున్సిపాలిటీ నిధులు మంజూరు పట్ల కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభినందనలు తెలుపుతూ బుధవారం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మున్సిపాలిటీ పాలకవర్గం సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో రాఖీ పండుగ

నవతెలంగాణ-జన్నారం

రాఖీ పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని రాఘవేంద్ర కరిమల జూనియర్ కాలేజ్‌లో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో రాఖీ పండుగ జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి అజ్మత్‌ఖాన్ మాట్లాడుతూ ఎల్లప్పుడు అన్నాచెల్లెల అనుబంధంతో విద్యార్థులందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. 2022-23లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఇలానే పట్టుదలతో చదివి రానున్న రోజులలో మరెన్నో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షులు కామెర రాకేష్, మండల నాయకులు పాల్గొన్నారు.



మంచిర్యాల నియోజకవర్గానికి రూ.81.60కోట్లు మంజూరు

నవతెలంగాణ - హాజీపూర్

మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసం కేసీఆర్ రూ.81.60కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే దివాకర్‌రావు పేర్కొన్నారు. జూన్‌లో ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఇచ్చిన హామీ మేరకు ఈ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేట్ మున్సిపాలిటీలకు ఒక్కో దానికి రూ.25కోట్ల చొప్పున రూ.75కోట్లు మంజూరయ్యాయన్నారు. 66 గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున రూ.6.60 కోట్లు కలుపుకొని మొత్తంగా రూ.81కోట్ల60 లక్షల నిధులు మంజూరు చేయడంపై సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఖరీఫ్ ధాన్యం సేకరణకు కార్యాచరణ రూపొందించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

2023-24 సంవత్సరంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియ సంబంధిత కార్యాచరణను రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. బుధవారం వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్కెటింగ్, కార్మిక, రవాణా, తూనికలు కొలతలు, ఐకెపి అధికారులు, రైస్ మిల్లర్లతో వచ్చే ఖరీఫ్ ధాన్య సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్ సంబంధించి ధాన్యం సేకరణ కొరకు సంబంధిత ప్రణాళికలను ముందస్తుగా రూపొందించుకొని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎఫ్.సి.ఐ. అధికారుల భాగస్వామ్యంతో జిల్లాలో సాగు అవుతున్న వరి పంట రకాలను నిర్ణీత ప్రొఫార్మాలో నమోదు చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు సి ఎం ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ సమీక్షలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో ఆధారాలు లేకుండా ఆరోపణ చేస్తే చర్యలు

నవతెలంగాణ-ఖానాపూర్

సోషల్ మీడియాలో ఆధారం లేకుండా అనవసరమైన ఆరోపణలతో పోస్ట్ పెడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఎస్సై రుక్మావర్ శంకర్ అన్నారు. సోషల్ మీడియాలో ఏదైన రాజకీయ పార్టీ గురించి అసత్య, వ్యతిరేక, అసభ్యకరమైన నినాదాలు, వ్యక్తుల గురించి వ్యక్తిగతమైన దూషణలు, అసత్య, నిరాధారమైన ఆరోపణలు చేస్తే వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. అంతేకాకుండా ముందస్తు అనుమతి లేనిదే డి జే సౌండ్ సిస్టమ్ పెట్టడం, ర్యాలీలు తీయడం చేయకూడదని, ఒకవేళ అనుమతి లేకుండా ఇలా చేసినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థికి మహిళా కమిషన్ సభ్యురాలు అభినందనలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోవ లక్ష్మి పేరు ప్రకటించిన నేపథ్యంలో మహిళా కమిషన్ సభ్యురాలు కుంరం ఈశ్వరిబాయి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి.

పైడిపల్లిని సన్మానించిన గౌడ సంఘం నాయకులు



నవతెలంగాణ-ఖానాపూర్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పైడిపల్లి రవీందర్‌రావును బుధవారం ఖానాపూర్ గౌడ సంఘం నాయకులు, పూర్వ ఆదర్శ రైతులు వేరువేరుగా మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు, పూర్వ ఆదర్శ రైతులు మాట్లాడుతూ సీనియర్ నాయకులు రవీందర్‌రావుతో కలిసి తాము ఎన్నికల్లో నడుస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు సన్మానం



నవతెలంగాణ-కాసిపేట

బీఆర్ఎస్ బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడో సారి ప్రకటించిన సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దుర్గం చిన్నయ్యను సన్మానించారు. బుధవారం రైతుబంధు మండల అధ్యక్షుడు దుర్గం పోశం ఆధ్వర్యంలో మండల నాయకులు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో దుర్గం చిన్నయ్య గెలుపే ధ్యేయంగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లంక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అధిక వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన దీనస్థితిలో ఉన్న రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో సుమారు 60వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు ప్రాథమికంగా తేల్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారిక సర్వేకు ఆదేశాలు ఇవ్వకపోవడంతో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించలేదన్నారు. దీంతో జిల్లాలో ఎన్ని ఎకరాల్లో పంటలు నష్టపోయాయో కచ్చితమైన సమాచారం లేకుండా పోయిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కో రైతు పెట్టుబడి కింద ఎకరానికి రూ.30వేల వరకు నష్టపోవాల్సి వచ్చిందని, మళ్లీ పంటలు కూడా వేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. మరోపక్క కొన్నేండ్ల పాటు అమలైన ఫసల్ బీమా పథకం రాష్ట్రంలో 2020 నుంచి అమలు కావడం లేదని, దీంతో రైతుల నుంచి బ్యాంకులు ప్రీమియం తీసుకోకపోవడంతో పంటలకు నష్టపరిహారం రావడం లేదన్నారు. రైతులు వాటా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటి వాటాలు చెల్లించకపోవడం మూలంగా ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 37,142 మంది గిరిజనులకు 1,01,508 ఎకరాల పోడు భూములకు హక్కుపత్రాలను పంపిణీ చేశారని, ఆదిలాబాద్ జిల్లాలో 12,222 మందికి 31,683 ఎకరాలను పంపిణీ చేశారని తెలిపారు. కానీ చాలా మంది రైతులకు ఐదు ఎకరాలు పోడు భూమి ఉంటే కేవలం 2 ఎకరాలకు మాత్రమే హక్కుపత్రాలు అందించారని తెలిపారు. చాలా మంది గిరిజన రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. రెండో విడత దళితబంధు పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. జిల్లా కేంద్రంలో డబుల్‌బెడ్‌రూమ్ పంపిణీ కోసం లక్కీ డ్రా నిర్వహించారని, ఈ ప్రక్రియ ముగిసి రెండు నెలలు గడిచినా ఇప్పటికీ ఇండ్ల కేటాయింపు జరగడం లేదన్నారు. రెండో విడత లక్కీ డ్రా నిర్వహించడంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోందని మండిపడ్డారు. బీసీ కులవృత్తులకు ఆర్థిక చేయూతనందించేందుకు ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించిందని, తొలుత నియోజకవర్గానికి 300మందికి అందిస్తామని చెప్పి కేవలం 50మందికి మాత్రమే అందజేసి చేతులు దులుపుకొన్నారన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పేరుకే పెద్దాసుపత్రిగా ఉందన్నారు. పూర్తిస్థాయిలో వైద్యులు లేక ఆసుపత్రి బోసిపోతుందన్నారు. సూపర్ స్పెషాలిటీని పీహెచ్‌సీ స్థాయికి తీసుకురాకుండా వెంటనే వైద్యుల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, మంజుల పాల్గొన్నారు.

ఏరియర్స్‌పై యాజమాన్య మౌనం సరికాదు : సీఐటీయూ



నవతెలంగాణ-మందమర్రి

ఏరియర్స్‌పై సింగరేణి యాజమాన్యం మౌనం సరికాదని సీఐటీయూ నాయకులు అన్నారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. మందమర్రి బ్రాంచ్‌లోని నాయకులందరూ ఆయా గనులపై పిట్ కమిటీల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రామగుండం మెడికల్ కాలేజీ, భద్రాచలం శాశ్వత నిర్మాణాలకు ఒకేసారి పెద్ద మొత్తంలో నిధులను ఇవ్వడానికి లేని అడ్డంకులు కార్మికులకు న్యాయంగా రావాల్సిన వేతన ఒప్పంద బకాయిలు ఇవ్వడానికి అడ్డమేముందని ప్రశ్నించారు. కోల్ ఇండియా ఉత్తర్వుల ప్రకారం కొత్త వేతనాన్ని అమలు చేసిన యాజమాన్యం అదే కోల్ ఇండియా బకాయిలు ఇవ్వమని సర్క్యులర్ పంపినా యాజమాన్యం స్పందించకుండా మౌనం వహిస్తూ ఉండడం సరికాదని తెలిపారు. సంస్థ ఆర్థిక పరిస్థితి బాగుందని వేల కోట్ల లాభాలు వచ్చాయని చెప్పే యాజమాన్యం ఏరియర్స్ ఇవ్వడానికే వెనకంజ వేస్తే ఇదే నెలలో లాభాల వాటా దీపావళి, బోనస్ లాంటిది ఇవ్వడానికి నిధులు ఉన్నాయో లేవోననే అనుమానం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాసిపేట-2 గనిపై అల్లి రాజేందర్, సురేష్, హనుమంతు, కాసిపేట-1 గనిపై తిరుపతి, శాంతిఖనిపై జడల ప్రవీణ్, కెకె ఓసీపీపై మేడి రాజమల్లు, మహమ్మద్ ఆరిఫ్, వర్క్‌షాప్, సివిల్ డిపార్ట్మెంట్లో వడ్లకొండ ఐలయ్య, భేతి భారత్, రాజ్‌కుమార్, కెకె 6 గనిపై వెంకటస్వామి, వెంకటేష్, వెంకటేష్, చైతన్యరెడ్డి, శ్రీనివాస్, ఆర్కెపి సిహెచ్‌పి, ఓసీపీలపై రామస్వామి, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

రాఖీలు కట్టి సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ సమగ్రశిక్షలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం శిబిరం వద్ద రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని కేసీఆర్ ప్రతిమ ధరించిన తోటి పురుష ఉద్యోగులకు మహిళా ఉద్యోగులు రాఖీలు కట్టి నిరసన వ్యక్తం చేశారు. కేసీఆర్ నామస్మరణ చేశారు. కరుణించి అందరినీ రెగ్యులరైజ్ చేయాలని, మినిమం టైం పేస్కేల్ ఎంటిఎస్‌ను కల్పించాలని కోరారు. పది లక్షల జీవితబీమా, ఆరోగ్యబీమాను కల్పించాలని డిమాండ్ చేశారు. ఓ వైపు ప్రభుత్వం వివిధ శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తుంటే విద్యార్హతలు, అనుభవం ఉన్న సమగ్రశిక్షలోని ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం ఆవేదన కలిగిస్తోందని అన్నారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను నెరవేర్చేవరకూ తమ పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. అటు సమ్మె శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ సంఘీభావం తెలిపారు. తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర సమ్మెకు సంఘీభావం తెలిపారు. రవీంద్రతో పాటు జిల్లా అధ్యక్షుడు జాదవ్ అశోక్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి నుటెంకి సత్యనారాయణ పాల్గొన్నారు. ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ సైతం సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఆయన వెంట ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, రాజు ఉన్నారు.

ఆసిఫాబాద్ : తమ సేవలు ప్రభుత్వం గుర్తించాలని కనీస వేతనాన్ని అమలు చేయాలని సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మూడవ రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కొనసాగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కొప్పుల మోహన్, అధ్యక్షురాలు విజయ లక్ష్మీ ప్రధాన కార్యదర్శి తుకారాం, జిల్లా నాయకులు గేడేకార్ సంతోష్ కుమార్, పవన్, సందీప్, రాజేష్, వెంకటరమణ, రమేష్, సంతోష్ పాల్గొన్నారు.డ రిలే దీక్షలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మర్సుకోల సరస్వతి, బిజెపి జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, ఎస్టియు జిల్లా అధ్యక్షుడు సంజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి తుకారాం మద్దతు తెలిపారు.



ఎల్ఐసిలో వేతన సవరణ చేపట్టాలి

- మంచిర్యాలలో ఉద్యోగుల నిరసన ప్రదర్శన



నవతెలంగాణ-హాజీపూర్

చాలా కాలంగా పెండింగులో ఉన్న వేతన సవరణ చేపట్టడానికి ఎల్ఐసి యాజమాన్యం సత్వరం చర్యలు తీసుకోవాలని భారతీయ జీవిత బీమా సంస్థ ఉద్యోగులు అధికారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రోజున మంచిర్యాల ఎల్ఐసి ఆఫీస్ ఆవరణలో భోజన విరామ సమయంలో వారు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం కార్యదర్శి మోర చరణ్ ప్రసంగిస్తూ.. సంస్థ పురోగతికి సహకరిస్తున్న ఉద్యోగులు అధికారుల వేతన సవరణలో ఆలస్యం తగదని హెచ్చరించారు. ఫ్యామిలీ పెన్షనులో 30శాతం పెరుగుదల అమలు చేయాలని, ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను సైతం పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్ఐసిని ప్రభుత్వ రంగంలోనే మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల సాధన కోసం వచ్చే నెల 12న సమ్మె చేపట్టనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి అధికారుల సంఘం డివిజనల్ ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యనారాయణ, వికాసాధికారుల సంఘం నాయకులు ప్రవీణ్ కుమార్ ప్రభాకర్ శ్రీధర్ ఉద్యోగుల సంఘం నాయకులు తిరుపతిరెడ్డి, సత్యనారాయణ, శివరంజన్, ఆర్ రాజేశం, సంజీవయ్య సుష్మ, గోపి, మల్లేష్, శైలజ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

నవతెలంగాణ-జైపూర్

నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని శ్రీరాంపూర్ సీఐ రమేష్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాహనాల ధృవపత్రాలను తనిఖీ చేశారు. ధృవ పత్రాలు సరిగ్గా లేనటువంటి 30 మోటార్ సైకిళ్ల, 10 ఆటోలను సీజ్ చేశారు. నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల రక్షణ భద్రత పోలీస్ బాధ్యత అని సీఐ రమేష్ అన్నారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. సమస్యలు ఏవైనా తమ దృష్టికి తీసుకురావాలని, అవసరమైనప్పుడు 100 నెంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, వాట్సాప్ కాల్స్‌కు స్పందించవద్దని తెలిపారు. కార్యక్రమంలో జైపూర్, శ్రీరాంపూర్, భీమారం ఎస్సైలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

గత కొనేళ్లుగా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి త్రివేణి అన్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెలో భాగంగా జేఏసీ పిలుపు మేరకు సమ్మె నోటీసును సీడీపీవో విజయ లక్ష్మికి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. అనేకమార్లు వినతి పత్రలు, నిరసనలు తెలిపిన పట్టించుకోవడం లేదన్నారు. సమస్యల సాధనకు జేఏసీ పిలుపు మేరకు సెప్టెంబర్ 11 నుంచి సమ్మె చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఎన్నికలు జరిగేలోపు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, నాయకులు వెలిశాల కృష్ణమాచారి, అంగన్‌వాడీ టీచర్లు ఉమాదేవి, నిర్మళ, హేమలత, అర్చన, విమల, శాంత, సంధ్య, మందకుమారి, చంద్రకళ, మీరా, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

సమానత్వ భావనను పెంపొందించుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

చట్టం దృష్టిలో అందరూ సమానమేని, ప్రజలు సమానత్వ భావాలను పెంపొందించుకోవాలని ఎస్సై రాజశేఖర్ అన్నారు. బుధవారం గోపాల్‌నగర్ గ్రామంలో రెవెన్యూ అధికారులతో కలిసి పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ రాజ్యాంగం ద్వారా కల్పించబడ్డ హక్కులను అనుభవిస్తూనే సమాజంలో బాధ్యతాయుతంగా జీవించాలని తెలిపారు. ప్రజలు కుల, మత, జాతి బేధాలు లేకుండా సమానత్వంతో జీవించాలని తెలిపారు. బడి గుడి వంటి సామాజిక ఆస్తుల్లో అందరికీ సమాన హక్కులు ఉంటాయని తెలిపారు. అధికాదాయ వర్గాల వారు అల్పాదాయ వర్గాలపై అణిచివేత ధోరణి కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మాదారం ఎస్ఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కులం, మతం, పేద సామాజిక విధ్వంసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దళితుల భూసమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులను కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మురళీధరరావు, గ్రామ కార్యదర్శి వసంత, గ్రామ సర్పంచ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గానికి ఎస్డీఎఫ్ నిధులు మంజూరు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జూన్ 30న జిల్లా కేంద్ర పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీకి ఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే ఆత్రం సక్కు తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి పది లక్షలు చొప్పున ఆసిఫాబాద్ మున్సిపాలిటీ రూ.25కోట్లు అభివృద్ధి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. దీనికి అనుగుణంగా ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్, గాదిగూడ మండలాల 48 గ్రామ పంచాయతీలకు రూ.4.8 కోట్లు, అలాగే ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలోని 242 గ్రామపంచాయతీలకు 10 లక్షలు చొప్పున ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి 25 కోట్లు మొత్తం 49 కోట్ల 20 లక్షలు ఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ అయిందన్నారు. గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయడంతో నియోజకవర్గ అభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు నమోదుకు సెప్టెంబర్ 19 చివరి తేది

నవతెలంగాణ-బెజ్జూర్

ఓటు నమోదు కోసం సెప్టెంబర్ 19 చివరి తేది అని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి తుకారాం తెలిపారు. బుధవారం మండల కేంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితా వివరాలను నోటీస్ బోర్డుపై అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటు నమోదు చేసుకొనే యువకులు అక్టోబర్ ఒకటి వరకు 18 సంవత్సరాలు నిండిన వారు సెప్టెంబర్ 19వ తేదీలోగా తహసీల్దార్ కార్యాలయంలో ఫారం నెం.6 పూర్తిచేసి అందజేయాలని కోరారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ జావీద్, కారోబార్ వసంత్, మల్టీపర్పస్ వర్కర్లు ఉన్నారు.

విద్యార్థులకు సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ - కాసిపేట

కాసిపేట మండలంలోని తాటిగూడ గ్రామ పంచాయతీలోని దిశ మోడల్ స్కూల్లో విద్య సామాగ్రిని పంపిణీ చేశారు. బుధవారం ప్రభుత్వం విద్యార్థులకు అందించిన వర్క్ బుక్స్, పెన్సిల్స్, మెటీరియల్‌ను సర్పంచ్ ముత్యాల స్వప్న చేతుల మీదుగా అందించారు. అనంతరం రాఖీ పండుగ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమాదేవి, నాయకులు ముత్యాల రాజయ్య, అంగన్వాడీ టీచర్ రూప, ఆయ భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



నవతెలంగాణ-దహెగాం

గొర్రెల పెంపకంతో లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జెడ్పీటీసీ తాళ్లపెల్లి శ్రీరామారావు అన్నారు. బుధవారం మండలంలోని చంద్రపెల్లి గ్రామంలో రెండో విడత గొర్రెలను పంపిణీకి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు యూనిట్లలో 126 గొర్రెలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గొల్లకుర్మలను ఆర్థికంగా ప్రోత్సహించడానికే ఈ పథకం ప్రవేశపెట్టరని తెలిపారు. గతంలో ఇచ్చిన గొర్రెల లబ్ధిదారులు ఆర్థికంగా ఎదుగుతున్నారని, రెండో విడత కూడా వాటిని సంరక్షించుకొని ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, సర్పంచ్ దామోదర్, ఎంపీటీసీ రాకేష్, పశువైద్యాధికారి శ్రావన్‌తో పాటు నాయకులు సంతోష్, నాగేష్‌గౌడ్, బాలకిషన్, పాపయ్య, మధూకర్ పాల్గొన్నారు.

ప్రజల భద్రతకే కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-నిర్మల్



ప్రజల భద్రతకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని పట్టణ సీఐ పురుషోత్తమచారి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ఎదుట నూతన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 61 బైక్‌లు, 28 ఆటోలు, ఒక ఐచర్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డికాపు సంఘానికి రూ.5 లక్షలు మంజూరు

నవతెలంగాణ-నిర్మల్



రెడ్డికాపు సంఘానికి రూ.5 లక్షలు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మంజూరు చేశారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం పార్‌పెల్లి రెడ్డికాపు సంఘం సభ్యులు వంటశాల షెడ్డుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో అల్లోల సురేందర్‌రెడ్డి, పార్‌పెల్లి ఎంపీటీసీ కల్యాణి గోవర్ధన్, కాంకల్ల రాకేష్, చంద రాజన్న, వైడింగ్ రాజేశ్వర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- డీఈఓ రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-దస్తురాబాద్

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని మున్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలను, రేవోజీపేట, బుట్టాపూర్ పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రార్థన సమయంలో ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా లేదా, విద్యార్థులు ఎంత మంది హాజరవుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులతో చదివించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్నా ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఇప్పటి నుంచే క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని సూచించారు. చదవడం, రాయడం పట్ల శ్రద్ధ చూపాలని అన్నారు. పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి 10 జీపీఏ పాటు పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకరావాలని ఆకాక్షించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు.

బీఆర్ఎస్ అవినీతి పార్టీ, కాంగ్రెస్ అభివృద్ధి పార్టీ

- డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు

నవతెలంగాణ-నిర్మల్

బీఆర్ఎస్ అవినీతి పార్టీ అని, కాంగ్రెస్ అభివృద్ధి పార్టీ అని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. బుధవారం దిలావర్‌పూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేసింది ఏమీ లేదన్నారు. డీ1 పట్టాల పేరుతో వేల ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. మంత్రిని గద్దె దించేందుకు నిర్మల్ ప్రజలందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి నిర్మల్ లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అర్జుమాన్ అలీ పాల్గొన్నారు.

రాఖీ ఆకారంలో శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థులు

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని హంస వాహిని ప్రయివేట్ పాఠశాల విద్యార్థులు బుధవారం రాఖీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులందరూ రాఖీ ఆకారంలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థినులు, విద్యార్థులకు రాఖీలు కట్టి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఓంకార దేశాయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

నవతెలంగాణ-దస్తురాబాద్

సోషల్ మీడియాలో ఏదైనా రాజకీయ పార్టీల గురించి అసత్య, వ్యతిరేక నినాదాలు, ప్రచారాలు చేసిన, వ్యక్తిగతంగా దూషించిన, నిరాధారమైన ఆరోపణలు చేసిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా డీజే, ర్యాలీలు చేపట్టవద్దని సూచించారు. నిబంధనలను ఎవరు ఉల్లంఘించిన చట్టరీత్యా చర్యలుంటాయని స్పష్టం చేశారు.

మున్సిపాలిటీ అభివృద్ధి పనులు చేపడుతాం

- మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి పనులు చేపడతానని మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25 కోట్లను మంజూరు చేసిన సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్, దండే విఠల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ అబ్దుల్ ఖలీల్, కౌన్సిలర్స్, నాయకులు కారింగుల సంకీర్తన సుమన్, కోఆప్షన్ సభ్యులు అంజాద్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.

సిలిండర్ ధర తగ్గింపుపై హర్షం

నవ తెలంగాణ-ఖానాపూర్

సిలిండర్ ధర తగ్గింపుపై బుధవారం ఖానాపూర్‌లోని తెలంగాణ తల్లి చౌరస్తాలో బీజేపీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సిలిండర్ ప్రదర్శన నిర్వహించారు. ప్రజల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని రాఖీ పండగ సందర్భంగా మహిళలకు రాఖీ కానుకగా గ్యాస్ సిలిండర్‌పై 200 తగ్గించిన ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాయకులు మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు మనోజ్, సల్కం సాయి, పంబాల ప్రశాంత్, సందపట్ల శ్రావణ్, శివరాజుల ఆనంద్, బుచ్చన్న, చిలుకూరి గిరి, పిట్టల భూమన్న, ముదం రాము, చిరంజీవి, అంకం మహేందర్, చుక్క సురేందర్, ఆసం సాయి, జెట్టి సురేందర్, కొప్పుల భీమేష్, సల్కం వెంకటేష్, శేఖర్ నరేందర్, గంగాధర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామానికి చెందిన మణికంఠకు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తన నివాసంలో బుధవారం రూ.12వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, వైస్ ఎంపీపీ లింబాజి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోశెట్టి, కోఆప్షన్ సభ్యులు మహమూద్ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ హక్కులపై అవగాహన కలిగిఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని సుందరయ్య నగర్‌లోని బుద్ధ విహార్‌లో బుధవారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ పౌరులకు కల్పించిన హక్కులకు గురించి వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి తెలుసుకోవాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా గురుకులాలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజాహితమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ అధికారులను ప్రశంసించిన ట్రైనీ ఐఏఎస్‌లు

నవతెలంగాణ-పెంచి



ఫీల్డ్ స్టడీ రీసెర్చ్ ప్రోగ్రాంలో భాగంగా మండలానికి విచ్చేసిన 7గురు సభ్యులతో కూడిన సివిల్స్ ట్రైనీ బృందం సభ్యులు బుధవారం రైతువేదికను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ తరపున అమలు చేస్తున్న వివిధ ప్రతిష్టాత్మక పథకాల అమలు, నిర్వహణ, పర్యవేక్షణ గురించి స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు ట్రైనీ ఆఫీసర్‌లకు వివరించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఆఫీసర్ సుభాష్ కార్తిక్ మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టిన వినూత్న కార్యక్రమాలు ఆసక్తికరంగా ఉన్నాయని తెలిపారు. రైతు సంఘాల ఏర్పాటు, అటవీ భూములలో నీలగిరితో పాటు పత్తి అంతర పంటలకు ప్రోత్సహం, యువతకు వ్యవసాయ యాంత్రీకరణలో ఉపాధి కల్పించడం లాంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు మనస్ఫూర్తిగా పనిచేస్తేనే అద్భుతాలు చేయడం సాధ్యం అవుతుందని కొనియాడారు. అనంతరం రైతు సల్లా రామేశ్వర్‌రెడ్డి చేస్తున్న మిశ్రమ వ్యవసాయ క్షేత్రాన్ని శిక్షణ అధికారుల బృందం పరిశీలించింది. రైతు తన 4 ఎకరాల వ్యవసాయ భూమిలో ఆయిల్‌పామ్ తోటలో పసుపు అంతర పంటగా వేయడం, సూక్ష్మ నీటి సేద్య పరికరాలతో సాగు నీరు అందించడం, పత్తి, కంది అంతర పంటగా వెయ్యడంతో పాటుగా మేకల పెంపకం చేపడుతున్నారు. ఈ సందర్భంగా శిక్షణ అధికారులు రైతును అభినందించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందంతో పాటు ఏఓ అసం రవి, యంపిఓ రత్నాకర్, భగీరథ ఏఈఈ విష్ణు, ఏఈఓలు రాజ్‌కుమార్, గంగాజల, ఐకెపి ఏపియం గంగాధర్, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

వసతి గృహాల్లో ప్రబలుతున్న జ్వరాలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రస్తుత వర్షాకాలంలో వసతిగృహాల్లో వైరల్ జ్వరాలలు ప్రబలుతున్నాయి. ఎక్కడ చూసిన విద్యార్థులు దగ్గు, జ్వరం, ఒళ్ల నొప్పుళ్లతో బాధపడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. బుధవారం మండలంలోని మెండపల్లిలోని టీడబ్ల్యూ రెసిడెన్షియల్ విద్యాలయం(బాలికలు)లో పది మంది విద్యార్థినులు వైరల్ ఫీవర్స్‌తో బాధపడుతూ స్థానిక పీహెచ్‌సీకి చికిత్సకు వచ్చారు. ఆ సమయంలో వైద్యులు లేక పోవడంతో సిబ్బంది ఇచ్చిన మాత్రలు తీసుకొని వెళ్లారు. మండలంలో మొత్తం నాలుగు ఆశ్రమ పాఠశాలలు, ఒక కేజీబీవీ, ఒక ఏకలవ్య గురుకులం, ఒక టీడబ్ల్యూ గురుకుల విద్యాలయం ఉంది. ఇందులో చదువుకునే విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా ఉచిత భోజనం, విద్యను అందిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా ప్రతి ఏటా వర్షాకాలంలో వసతిగృహాల్లో సీజనల్ వ్యాధులతో అనేక మంది. విద్యార్థులు రోగాల బారినపడుతున్నారు. అనారోగ్యాలకు అపరిశుభ్రత, తాగునీరే కారణమని వైద్యులు అంటున్నారు.

వసతిగృహాల్లో ఆర్‌వో ప్లాంట్లు ఉన్నా వాటి మరమ్మతులు లేక మూలనపడ్డాయి. దీంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీరు అందక రోగాల బారిన పడుతున్నారు. వసతిగృహాల్లో అధికారులు పర్యటించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు స్వచ్ఛమైన తాగునీటి అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సర్దుబాటులో జరిగిన పొరపాట్లను సవరించాలి

నవతెలంగాణ-ఖానాపూర్



వీఆర్‌ఏలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన సమయంలో జరిగిన పొరపాట్లను వెంటనే సవరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. జనార్ధన్ డిమాండ్ చేశారు. బుధవారం చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌ను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తిస్తూనే, వివిధ శాఖలో సర్దుబాటు చేసే విషయంలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అనేక సంవత్సరాల ఆకాంక్షను ప్రభుత్వం నేరవేర్చినప్పటికీ, వీఆర్‌ఏలను ఇతర ప్రభుత్వ శాఖలలో సర్దుబాటు చేసే క్రమంలో వారి అభిప్రాయాలను తీసుకోకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ, జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్, ఉపాధ్యక్షుడు భూక్య విలాస్, కోశాధికారి దుర్గం లింగన్న, వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షులు బోజన్న, జిల్లా సలహాదారుడు దుప్పి పోశెట్టి, ప్రవీణ పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ అధికారుల దాడులు

- వెంకటాపూర్ అటవీప్రాంతంలో 900 లీటర్ల బెల్లం పాకం ధ్వంసం



నవతెలంగాణ-ఖానాపూర్

మామడ మండలంలోని వెంకటాపూర్ అడవి ప్రాంతంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించి, తొమ్మిది వందల లీటర్ల బెల్లం పాకాన్ని ధ్వంసం చేశారు. ఎక్సైజ్ స్టేషన్ నిర్మల్ పరిధిలో నిషేధిత గుడుంబా అరికట్టడంలో భాగంగా బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుడుంబా అమ్మకాలు, రవాణాపైనే కాకుండా క్షేత్ర స్థాయిలో తయారీ కేంద్రాలు, స్థావరాలపై కూడా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు నిర్మల్ స్టేషన్ ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఐదు గుడుంబా తయారు బట్టీలను కనుగొని ధ్వంసం చేశారు. నిర్మానుష్య ప్రాంతం పైగా నిందితుల ఆచూకీ తెలియలేదని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. గుడుంబా ఆనావాళ్ల కొరకై ఇండ్లలో తనిఖీలు నిర్వహించుతూ కేసులు నమోదు, బైండోవర్ చేస్తున్న నేపథ్యంలో, తయారుదారులు తమ పంథాను మార్చుకుని దొరకకుండా అటవీ ప్రాంతంలో తయారు చేస్తున్నారని అన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది నరేందర్, ముత్యం, ఇర్ఫాన్, భాస్కర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక

నవతెలంగాణ-ఖానాపూర్



ప్రభుత్వ పాఠశాల్లో మంచి సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులకు నల్గొండకు చెందిన పుడమి సాహితి సంస్థ ఉత్తమ ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డులతో సత్కరిస్తుంది. కాగా సెప్టెంబర్ 3న ఈ సంవత్సరం నల్గొండలో "డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2023 పంపిణీ చేయనుంది. దీనికి ఖానాపూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు వాల్గొట్ కిషన్ ఎంపికయ్యారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాత ఎల్లాపూర్‌లో పనిచేస్తున్నారు. గత రెండున్నర దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులుకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, తన సొంత డబ్బులుతో విద్య సామాగ్రిని అందించారు. ఉచిత గురుకుల శిక్షణ, విద్యార్థులు, నిరుద్యోగులు కోసం వీకే ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి రెండు తెలుగు రాష్ట్రాలకు సలహాలు, సూచనలను అందిస్తున్నారు.

ఆయన సేవలకు గాను అవార్డుకు ఎంపిక చేశారు. నల్గొండలో జరిగే కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మెన్ గుత్త సుఖేందర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు స్వీకరించనున్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో అధికారం చేపట్టడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో పర్యటించారు. శాలువాతో సత్కరించారు. గ్రామంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజలకు మాయమాటలతో మోసగిస్తుందన్నారు. నిరుద్యోగులకు భృతి, పేదలకు డబుల్ బెడ్ రూం ఇస్తామని మోసగించదని ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు కలుగుతుందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలలో తనను ఆశీర్వదించాలని కోరారు. ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. ఆయన వెంట ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండల అధ్యక్షులు ముఖాడె ఉత్తం, అబ్దుల్ అయ్యూబ్, సోమాసే వెంకట్ రావ్, గ్రామ పటేల్ ఎరకుమ్ర జంగు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని, రాజీమార్గమే రాజమార్గమని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కోర్టు హాలులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో పది వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం ఐదుగురు అధికారులు మాత్రమే ఉన్నందున వాటి పరిష్కారానికి చాలా ఆలస్యం అవుతోందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయంతోపాటు డబ్బులు ఆదా అవుతాయని తెలిపారు. వేరే కోర్టుకు వెళ్లి అప్పీల్ చేసుకోవాల్సిన అసవరంలేదన్నారు. వాయిదాలకు కూడా రావాల్సిన పని ఉండదని స్పష్టం చేశారు. ఈ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే సెప్టెంబర్ 2న హైకోర్టు జడ్జి జస్టిస్ సూర్యపల్లి నంద ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి వస్తున్నారన్నారు. అదేరోజు జడ్పీ సమావేశ మందిరంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై ఏర్పాటు చేసే లీగల్ లెట్రసీ క్యాంపులో పాల్గొంటారని వెల్లడించారు.

పూలాజీ బాబా జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని పూలజీ బాబా ధ్యాన మందిరంలో బుధవారం ఆయన 99వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాబా చూపిన సన్మార్గంలో నడవాలన్నారు. శ్వాస మీద ధ్యాసతో ఏకగ్రతతో ధ్యానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. తలమడుగు ధ్యాన కేంద్రంలో 26 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు కాటిపెల్లి సురేష్‌రెడ్డి, నీలగిరి అశోక్, ప్రధాన కార్యదర్శి సునీతారెడ్డి, అనిత, నారాయణ, రాకేష్, రాధమ్మ భోజమ్మ, నారాయణ మహిళలు పాల్గొన్నారు.

3న పద్మశాలీ శంఖారావం

నవతెలంగాణ-ముథోల్

సరూర్‌నగర్ స్టేడియం హైదరాబాద్‌లో సెప్టెంబర్ 3న అఖిల భారత పద్మశాలి సంఘం నిర్వహించే పద్మశాలి శంఖారావం సభ విజయవంతం చేయాలని జిల్లా పద్మశాలి ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బూర ఉమాశంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాధికారంలో వాటా సాధించేందుకు పద్మశాలీ కులస్తులు సభ విజయవంతం చేయాలని కోరారు.

11 నుండి అంగన్వాడీలు సమ్మెకు సిద్ధం కావాలి

నవతెలంగాణ-నిర్మల్

సిఐటియు, ఏఐటీయూసీ జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11 నుంచి అంగన్వాడీలు సమ్మెకు సిద్ధమవుతున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. కలెక్టర్, డీడబ్ల్యూఓలకు విడివిడిగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కనీస వేతన రూ.26వేలు పెంచాలని, రిటర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు 60సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సెప్టెంబర్ 11 నుంచి మండల కేంద్రాల్లో అంగన్వాడీలు సమ్మె చేయడానికి సిద్ధమవుతున్నారని వెల్లడించారు. అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి, కార్యదర్శి లలిత, ఉపాధ్యక్షురాలు శైలజ, విజయ, భాగ్య, శశికళ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-కడెం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను చూసి ఆకర్షితులై, బీఆర్ఎస్ భారీగా భారీగా చేరుతున్నారని ఆ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్య జాన్సన్ నాయక్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి ముబారక్ టీన్ మొహమ్మద్ ఆధ్వర్యంలో ఖానాపూర్ పట్టణంలోని భుక్య జాన్సన్ నాయక్ స్వగృహంలో కడెం మండల కేంద్రానికి చెందిన యువకులు పెద్దఎత్తున చేరారు. వారిని జాన్సన్ నాయక్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.

బ్యాంక్‌లో సిబ్బంది కొరత

నవతెలంగాణ-తలమడుగు



మండలంలో కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో సిబ్బంది కొరతతో వినియోగదారు, ఖాతాదారులు బుధవారం అసహనం వ్యక్తం చేశారు. తగినంత సిబ్బంది లేకపోవటంతో చిన్న చిన్న పనులకు సైతం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని పలువురు ఖాతాదారు వాపోయారు. 6వేల పైచిలుకు ఖాతాదారులు ఉన్న మహారాష్ట్ర బ్యాంకులో కనీసం మేనేజర్‌తో కలిపి నలుగురు సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారని అన్నారు. తగినంత సిబ్బంది లేక వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ రుణాలు ఉన్న ఖాతాదారులు ఎక్కువ మంది ఉండటంతో, ప్రభుత్వ పథకాలు నేరుగా బ్యాంకు ఖాతాలకు బదిలీ కావడంతో ఖాతాదారులు రోజుల గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు. ఖాతాదారులకు అందాల్సిన సేవలు అందడం లేదని అన్నారు. వెంటనే బ్యాంకులో సరిపడ సిబ్బందిని నియమించాలని అన్నారు. వెంటనే స్పందించి సరిపడు సిబ్బందిని నియమించాలని ఖాతాదారులు కోరుకుంటున్నారు.

వందశాతం పాఠశాలకు హాజరైన విద్యార్థులకు బహుమతులు



నవతెలంగాణ-బోథ్

వంద శాతం పాఠశాలకు హాజరైన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాడపు మధుసూదన్ బహుమతులు అందజేశారు. బుధవారం మండలంలోని సొనాల గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఆగస్టు నెలలో 22 పని దినాలు కాగా వంద శాతం హాజరైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలోని విశ్రాంత ఉపాధ్యాయులు పి. లక్ష్మీ నర్సయ్య, ఉపాధ్యాయులు గీతావాణి, ఏ శ్రావణి పాల్గొన్నారు.

దశ దిన కర్మకు బాల్క ఫౌండేషన్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణంలోని స్థానిక 18వ వార్డు రామ్‌నగర్‌కు చెందిన బర్కం రవి యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేదని విషయం తెలుసుకున్న బాల్క ఫౌండేషన్ సభ్యులు బుధవారం బాధిత కుటుంబాన్ని ఓదార్చి, రూ.5000 రూ.ఆర్థిక సాయం సరిపడా బియ్యాన్ని పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పట్టణ ఇన్‌ఛార్జి గాండ్ల సమ్మయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు ఎర్రబెల్లి మూర్తి, కొండ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకొస్తేనే పేదల అభివృద్ధి

నవతెలంగాణ-జన్నారం



దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలు అభివృద్ధి చెందుతారని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు భక్షినాయక్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్‌ను హైదరాబాద్‌లో తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలంగా ఉందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మధుయాష్కిగౌడ్ ప్రతి గ్రామంలో పర్యటించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు తెలిపి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థికే ఓట్లేస్తామని తీర్మానం



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌కు రాబోవు ఎన్నికల్లో కలిసికట్టుగా ఓట్లేస్తామని మండలంలోని నిర్సింగాపూర్ గ్రామస్తులు తీర్మాణం చేశారు. బుధవారం గ్రామ సర్పంచ్ పండుగ రాజన్న, ఎంపీటీసీ బోయిని స్వాతి సంపత్‌లతో కలిసి గ్రామస్తులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అభివృద్ధికి చెన్నూరు ఎమ్మెల్యే ఎంతగానో కృషి చేయడం జరిగిందని పేర్కొన్నారు. అభివృద్ధిని కాంక్షించి పనిచేస్తున్న చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు రెండోసారి గెలిపించుకుంటామని తీర్మానం రాసుకున్నారు. గతంలో ఎప్పుడు జరగని అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందని మరోసారి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు సస్య రక్షణ చర్యలు పాటించాలని ఏఓ రామకృష్ణ సూచించారు. మండలంలోని నాగంపేట, గజ్జిగూడ, రాస్పల్లి గ్రామాల్లో వ్యవసాయ అధికారి రామకృష్ణ పర్యటించి రైతులు సాగుచేస్తున్న పత్తి పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలను వివరించారు. పత్తిలో పచ్చదోమ నివారణకు ఎసీఫేట్ 1.5 గ్రాము లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పత్తిలో పేనుబంక ఆశించే అవకాశం ఉందని పురుగు ఉధృతి ఉంటే పోనికామిడ్ 0.4 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ప్రస్తుతం వరి పిలకలు లేదా దుబ్బు చేసే దశలో ఉందని కాండం తొలిచే పురుగును రైతులు గమనిస్తే కేరాఫ్ హైడ్రోక్లోరైడ్ 50 ఏపీ మందును 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.

ఆర్కే ఓసీపీ గనిలో రక్షణపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్కే ఓసీపీ గనిపై బుధవారం బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ ఏజీఎం కేహెచ్ఎన్ గుప్త ఇటీవల ఆర్జీ-2, ఓసీ-3 జరిగిన ప్రమాదం గురించి అధికారులకు, కాంట్రాక్టు కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ ఉద్యోగులు అందరూ రక్షణతో తమ విధులను నిర్వహించాలని, ఉద్యోగులు తమ వ్యక్తిగత రక్షణతో పాటు తమ ఆరోగ్యంపైన కూడా తగు జాగ్రతలు పాటించాలని పేర్కొన్నారు. పని పట్ల శ్రద్ధ, నిబద్ధత, ఏకాగ్రత, అంకిత భావం ఉన్నప్పుడే ప్రమాదాల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సిమ్ టార్స్ మేనేజర్ విజయ్ కుమార్, ఆర్కే ఓసీపీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.గోవింద రావు, ప్రాజెక్టు ఇంజనీర్ పీ.మహేందర్, సేఫ్టీ ఆఫీసర్ కె.రామరాజు, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ ఏ. ఆంజనేయులు, టీబీజీకేఎస్ అసిస్టెంట్ పిట్ సెక్రెటరి మిట్ట పోషం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

- ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్ వినోద్ నాయక్

నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా శ్యాంనాయక్‌పై కేసు నమోదు చేయాలని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. బుధవారం జన్నారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇంద్రవెల్లి మండలం డోంగర్‌గావ్ గ్రామంలో హనుమాన్ విగ్రహానికి సంబందించిన కండ్లను ఎమ్మెల్యే తీసుకుపోవడంతో ఆ గ్రామంలో ఇద్దరికి కంటి చూపుపోయిందని ఆరోపించారు. ఆ బాదితుల్లో కరు మృతి చెందాడని ఎమ్మెల్యే నిర్వాకం వల్ల గ్రామంలో అనర్థాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ విషయంలో ఆమెపై ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు సుభాష్‌రెడ్డి, ప్రభుదాస్, ఫసి ఉల్లా, ఇమ్రాన్ రాగ, శ్రీను గౌడ్, తిరుపతి, ఇందయ్యా రమేష్, శ్యామ్, లక్ష్మణ్, అజయ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనానికి దారేది..?

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ భవనానికి వెళ్లే దారిలో అక్రమంగా కట్టడాలతో దారి లేకుండా చేస్తున్నారు. అంబేద్కర్ భవనం ముందున్న సర్వే నెంబర్ 374 ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు కడుతూ రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, వర్గాల సమావేశాలకు నిర్మించిన అంబేద్కర్ భవనానికి దారి లేకుండా చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలంటే, భవనానికి వెల్లడానికి వీలేకుండా దారికి అడ్డంగా పిల్లర్లు వేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ కట్టడాలను తొలగించి దారి సరి చేయాలని పలువురు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంఘాల నాయకులు కోరుతున్నారు. లేకుంటే ఆ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

అమలు కాని ఆర్టీసీ విలీనం

- లబ్ది పొందకుండానే ఉద్యోగ విరమణ
- నేడు ఆదిలాబాద్ రీజియన్‌లో 8 మంది రిటైర్డ్
- జీఓ అమలు ఆలస్యంతో నష్టపోతున్న కార్మికులు
- కార్మికుల పక్షాన పోరాటానికి సిద్ధమవుతున్న సంఘాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

"దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించడు" అనే సామెత వలె ప్రస్తుతం ఆర్టీసీ కార్మికుల పరిస్థితి తయారయింది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికులు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలంటూ 2019లో 50 రోజులపాటు సమ్మె చేశారు. ప్రభుత్వ నుంచి ఎటువంటి హామీ రాకపోవడంతో సమ్మె విరమించి ప్రభుత్వంతో చర్చించారు. అప్పటి నుండి ఆర్టీసీలో కార్మిక సంఘాలు రద్దు కావడంతో పాటు కార్మికుల మనోభావాలు బయటికి తెలిసే పరిస్థితి లేకుండా పోయింది. తాజాగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని అసెంబ్లీలో ఆగస్టు మూడో తేదీన బిల్లు పెట్టడంతో ఆశలు చిగురించాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందక ముందే గురువారం పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కార్మిక సంఘాలు కూడా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిసింది.

ఆశగా ఎదురుచూస్తున్న ఆర్టీసీ కార్మికులు

ప్రభుత్వం ఈ నెల మూడో తేదీన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ అసెంబ్లీలో బిల్లు అంగీకారం పొందినప్పటికీ గవర్నర్ అనేక సందేహాలు లేవనెత్తడంతో పాటు మార్పులు చేయమని ప్రభుత్వానికి సూచించింది. దీనితో బిల్లు న్యాయ సలహా కోసం గవర్నర్ పంపించింది. అది గవర్నర్ ఆమోదాన్ని పూర్తిస్థాయిలో పొంది ప్రభుత్వం జీఓ విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ నెల రోజుల నుంచి ఇదేది జరగలేదు. ప్రభుత్వం విడుదల చేసే జీఓ అమలుకు ఆర్టీసీ కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆదిలాబాద్ రీజియన్‌లో నేడు 8 మంది పదవీ విరమణ

బిల్లు చివరి దశకు వచ్చినప్పటికీ కార్యరూపం దాల్చకపోవడంతో నేడు పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులు నష్టపోవాల్సి వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 181 మంది గురువారం పదవి విరమణ పొందనుండగా ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఉట్నూర్, మంచిర్యాల, ఆసిఫాబాద్, బైంసా, నిర్మల్ డిపోలకు చెందిన 8 మంది పదవీ విరమణ పొందనున్నారు వీరిలో ముగ్గురు కండక్టర్లు ముగ్గురు డ్రైవర్లు, ఒకరు కంట్రోలర్, ఒకరు మెకానిక్ పదవి విరమణ పొందనున్నారు. వీరంతా చివరి క్షణం వరకు జీఓ కోసం ఎదురుచూస్తున్నారు.

నష్టపోతున్న కార్మికులు

ప్రభుత్వం ఆర్టీసీని విలీనం చేస్తూ బిల్లు ఆమోదించినప్పటికీ దాని కార్యచరణ రూపం దాల్చకపోవడంతో కార్మికులు నష్టపోవాల్సి వస్తుంది. ఆర్టీసీలో పదవీ విరమణ వయస్సు ప్రస్తుతం 60 సంవత్సరాలుగా ఉండగా ప్రభుత్వ ఉద్యోగులుగా మారితే అది మరో సంవత్సరం పెరిగే అవకాశం ఉంది. గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండడంతో లబ్ది పొందాల్సి ఆర్టీసీ కార్మికులు నష్టపోవాల్సి వస్తుంది.

కార్మికుల పక్షాన పోరాడుతాం

భోగే ఉపేందర్, ఎఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

నేడు పదవి విరమణ పొందుతున్న ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా మరొక సంవత్సరం పెంచాలని డిమాండ్ చేస్తున్నాం. బిల్లును కార్యరూపంలోకి తెచ్చి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు వారి పక్షాన పోరాడుతాం. నేడు పదవి విరమణ పొందే వారికి సంబంధించి అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రాలేదు

సోలేమాన్, ఆర్టీసీ ఆర్ఎం

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో నేడు 8 మంది వివిధ స్థాయిల ఉద్యోగులు పదవి విరమణ పొందనున్నారు. అయితే వీరికి సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఇప్పటివరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. గతంలో పదవి విరమణ పొందిన వారి మాదిరిగానే వీరు కూడా పదవీ విరమణ పొందవలసి ఉంటుంది.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో యూఎస్పీసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఒకటో తేదీన ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాలో భాగంగా చేపట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఐక్య గురుకులాల కన్వీనర్ దూలం ఐలయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో చలో హైదరాబాద్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు ఎలక్షన్ కోడ్ రాకముందే పూర్తి చేయాలని, 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. ఎయిడెడ్ రెసిడెన్షియల్ మోడల్ స్కూల్ కేజీబీవీ, యుఆర్ఎస్, గురుకుల తదితర అన్ని విద్యాసంస్థల ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు బేసిక్ పే ఇచ్చి వారి సర్వీసులు రెగ్యులర్ చేయాలని, ట్రెజరీలో ఆమోదం పొందిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు నెల మొదటి తేదీన వేతనాలు, పెన్షన్ చెల్లించాలని, గురుకుల ఉపాధ్యాయులకు పనిభారానికి తగ్గట్టుగా పారిటీ స్కేల్స్ మంజూరు చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన 5571 ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులు, 22000పైగా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని, కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020ని రద్దు చేయాలని కోరారు. ఆదాయపు పన్ను పరిమితిని ఎనిమిది లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావడానికి నిర్వహించే తలపెట్టిన చలో హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున నాయకులు ఉపాధ్యాయులు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు హేమంత్ షిండే, ఉపేందర్, నరేందర్, బ్రహ్మాచారి, సవిత, సైదులు, నరసింహచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలకు ఆర్టీసీ రాఖీ పౌర్ణమి ఆఫర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఆర్టీసీ అందిస్తున్న రాఖీ పౌర్ణమి ఆఫర్‌ను మహిళలు వినియోగించుకోవాలని డిపో మేనేజర్ శ్రీధర్ అన్నారు. బుధవారం రాఖీ పౌర్ణమి లక్కీ డ్రా బాక్సు బస్టాండు పరిధిలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ఈ నెల 30, 31 తేదీల్లో ప్రయాణించే మహిళల కోసం లక్కీ డ్రా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ లక్కీ డ్రా ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ.5.50 లక్షల విలువ గల బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 33 మంది మహిళలకు బహుమతులు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ నెల 30, 31 తేదిల్లో టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలందరూ ఈ లక్కీ డ్రాలో పాల్గొనవచ్చని, ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనకాల పేరు, వారి ఫోన్ నంబర్‌ను రాసి వాటిని బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లలో వేయాలన్నారు. ఆ డ్రాప్ బాక్స్‌లను ఒక చోటికి చేర్చి ప్రతి రీజియన్ పరిధిలో సెప్టెంబర్ తొమ్మిదవ తేదీన లక్కీ డ్రా నిర్వహించి ముగ్గురి చొప్పున విజేతలను అధికారులు ఎంపికచేస్తారని, ముఖ్య అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేస్తారన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. లక్కీ డ్రాకు సంబంధించి పూర్తి వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ-3 భారతి, కండక్టర్ వసంత్ రావ్ పాల్గొన్నారు.

మహిళల భద్రత-పోలీస్ బాధ్యత



హాజీపూర్ : పోలీసుల ఆధ్వర్యంలో మహిళల భద్రత పోలీస్ బాధ్యత కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముల్కల్ల ప్రభ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ మోసాలు, ఉమెన్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సంధ్భంగా విద్యార్థులు పోలీసులకు రాఖీలు కట్టారు.

జన్నారం : మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మహిళల భద్రత పోలీసులు బాధ్యత అనే అంశంపై ఎస్ఐ సర్కార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత కాల్స్‌కు స్పందించకూడదని అన్నారు. మహిళల రక్షణ భద్రత కోసం పోలీసులు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, అది తమ బాధ్యత అని అన్నారు. అనంతరం పోలీస్ అధికారులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు.

గూడెం సత్యదేవుని ఆలయంలో చోరీ

- విగ్రహాలకు అలంకరించిన నగలు దొంగతనం



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ప్రధాన ఆలయంలోకి చొరబడి హుండీని ధ్వంసం చేసేందుకు ప్రయత్నం చేశారు. బయట ఉన్న హుండీ పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.8వేల నగదును ఎత్తుకెళ్లారు. ఆలయ గర్భగుడిలోని విగ్రహాలకు అలంకరించిన సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలను దొంగిలించారు. లక్సెట్టిపేట సీఐ కృష్ణ, దండేపల్లి ఎస్సై ప్రసాద్ పోలీస్ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. మంచిర్యాల నుంచి క్లూస్ టీం సిబ్బందిని పిలిపించి వేలిముద్రల నమూనాలను సేకరించారు. వీలైనంత త్వరలో దొంగలను పట్టుకుని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ఇటీవలే సమీప జిల్లాలోని దేవాలయంలో చోరీ జరిగినట్లు సమాచారం ఉందని వారే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని సీఐ కృష్ణ అనుమానం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు కూడా ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారని సీసీ కెమెరాలు రికార్డ్ అయిన పుటేజ్ ఆధారంగా దొంగలను గుర్తిస్తామని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వహణ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇదే మాదిరిగా గతంలో ఒక్కసారి ఆలయంలో దొంగతనం జరిగినట్టు తెలిపారు. ఆలయ మొత్తం సీసీ కెమెరాలు అమర్చినట్లు పేర్కొన్నారు. ఆలయానికి భద్రత పెంచే దిశగా కృషి చేస్తామని తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు జంబోజుల నగేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, వెంకట్ గౌడ్, కోశాధికారి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు బాబుగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు బట్టుపల్లి సంతోష్, మడావి శ్రీనివాస్, ఏపూరి శ్యామ్, తాటిపల్లి ఆశిష్, శ్రీనివాస్ గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

బాలికలకు కిశోర అమృతం పంపిణీ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎల్లూరు గ్రామంలో గల కొత్తగూడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కిశోర బాలికలకు అమృతం ప్యాకెట్లను సర్పంచ్ దుర్గం రాజన్న అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 14 నుండి 18 సంవత్సరాల వయసు గల బాలికలకు కిశోర అమృతం ప్యాకెట్లను అందిస్తుందని, వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, అంగన్‌వాడీ కార్యకర్త శకుంతల, అంగన్‌వాడీ ఆయా హంస పాల్గొన్నారు.

కమానలో పౌరహక్కుల దినోత్సవం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన గ్రామ పంచాయతీలోని గ్రంథాలయం ఆవరణలో బుధవారం సర్పంచ్ సెండె పవన్ అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ దుర్గం శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులు ప్రతి ఒక్క భారతీయుడికి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందులో భాగంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పోశెట్టి, హాస్టల్ వార్డన్ తిరుపతి, ఏపీఓ స్రావన్‌కుమార్, జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రె ప్రవీన్, వార్డుసభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావును మండల రియల్ ఎస్టేట్ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ కమిటీ సభ్యులు అల్లూరి రాజు, చపిడె వెంకటేశం, రాజమౌళి, ఆదె సంతోష్, బాపూజీ, రమేష్ పాల్గొన్నారు.

పెన్షన్ అందజేత

నవతెంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని కొండపెల్లి గ్రామంలో బుధవారం తెలంగాణ ప్రభుత్వం వికలాంగులకు రూ.4016 పింఛన్ మంజూరు చేయగా కొండపెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సంజీవ్ పింఛన్ అందజేవారు. కార్యక్రమంలో డీపీఎం రాధాకృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాఖీ దుకాణాల్లో సందడి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని రాఖీ దుకాణాల్లో సందడి నెలకొంది. గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా మండలంలో రాఖీలు కొనుగోలు చేయడానికి వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు దుకాణాల వద్ద గుంపులు గుంపులుగా ఉండడంతో కోలాహలం నెలకొంది.

www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
12
గురువారం 31 ఆగస్టు 2023

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ

నవతెలంగాణ-జన్నారం



జన్నారం కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ లక్ష్మీ-రవి బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జన్సాన్ నాయక్ ఆయనకు గులాబీ కండువ కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని, పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఫజల్ ఖాన్ పార్టీ నాయకులున్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి

నవతెలంగాణ - దహెగాం



ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బండ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని రైతువేదికతో పాటు బీబ్రా రైతువేదిక వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొక్కల పెంపకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. ప్రజలు భాగస్వాములై మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు వెన్నెల, శోభన్, ఎంపీటీసీ శంకర్, రైతు సమన్వయ సమితి మండల సభ్యులు నాయికిని లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డ్ సర్వే నెంబర్ 76లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ప్రహరీని బుధవారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు కూల్చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టారని కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ ఆదేశాల మేరకు ప్రహరిని కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే కాలనీ వాసులు మాత్రం అధికారుల తీరుపై విమర్శలు చేస్తున్నారు. ఐదు నెలలుగా ఫిర్యాదు చేస్తున్న పట్టించుకోలేదని, కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ నిరసన తెలపడంతోనే అధికారులు తూతూ మంత్రంగానే చర్యలు చేపట్టి వెళ్లిపోయారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఆర్ సతీష్, ఆర్ఐ మాంతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల బతుకులు ఇంతేనా?

- సీఐటీయూ రాష్ట్ర నాయకులు దూలం శ్రీనివాస్



నవతెలంగాణ - కాసిపేట

బంగారు తెలంగాణలో కాంట్రాక్టు కార్మికుల బతుకులు మారవా? అని సీఐటీయూ రాష్ట్ర నాయకులు దూలం శ్రీనివాస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం కాంట్రాక్టు కార్మికుల సంఘం(సిఐటియు) ఆధ్వర్యంలో వేతనాల పెంపుదలకు పోరుబాటలో భాగంగా మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 గనిలో గేటు మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన కార్మికుల బతుకులు నేటికీ మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులకు కార్మికులపై పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వారి బతుకుల్లో ఏలాంటి మార్పు రాకపోగా, చాలీచాలని వేతనాలతో అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాల జీవోను, పెరిగిన ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సవరించాల్సి ఉన్నా కూడా 10 ఏళ్లు గడుస్తున్నా జీవోలను సవరించకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. దీంతో పెరుగుతున్న నిత్యావసర ధరలు, మరోవైపు విపరీతమైన పని భారంతో కాంట్రాక్టు కార్మికులు సతమతమవుతున్నారన్నారు. అధికారంలోకి రావడానికి ముందు కాంట్రాక్టు కార్మికులు అంటే బానిస వ్యవస్థ అని దానిని మొత్తంగా నిర్మూలిస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు, నేడు ఆ వ్యవస్థను పెంచుతూ, వారికి పని భద్రత లేకుండా చేశారని మండిపడ్డారు. మళ్లీ మూడోసారి ఎన్నికలకు సిద్ధమైన బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల వేతనాల జీవోలను గెజిట్ చేయకుండా ఏ విధంగా కార్మికుల, వారి కుటుంబాల ఓట్లకు వస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి అల్లి రాజేందర్, అండర్ గ్రౌండ్ కార్మికులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి ప్రతిరోజు వందలాదిమంది ప్రజలు ఇతర ప్రాంతాల నుండి వస్తారని అన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో కలకృత్యాల కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గతంలో ఉన్న పాత మార్కెట్ స్థానంలో కొంతమంది బహిరంగ మలవిసర్జన చేయడంతో దుర్గాంధం వెదల్లుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి బస్టాండ్ ఏరియా, జూబ్లీ మార్కెట్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, గెడం టికనంద్, జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థికి సింగరేణి అధికారుల బాసట



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

దహెగాం మండలం చంద్రవెల్లికి చెందిన సంగర్ష స్రవంతి నీట్‌లో మంచి ర్యాంక్ సాధించి ప్రభుత్వ కోటాలో కరీంనగర్ ప్రతిమ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. తండ్రి చిన్నతనంలో మరణించగా తల్లి కూలి చేసి స్రవంతిని చదివించింది. ప్రస్తుతం అమెకు హాస్టల్ ఫీజు ఇతర ఖర్చులకు సైతం ఇబ్బందిపడే పరిస్థితి నెలకొంది. కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు స్పందించి సింగరేణి కొత్తగుడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేము రాజు దృష్టికి తీసుకెళ్లగా స్పందించి బుధవారం స్రవంతికి తన కార్యాలయంలో రూ.10 వేల చెక్కును, ఇల్లందు ఏరియా సెక్యూరిటి అధికారి అంజి రెడ్డి రూ.10 వేలు, కొత్తగుడెం ఏరియా సెక్యూరిటి అధికారి రమణరెడ్డి రూ. 5 వేలు మొత్తం రూ.25 వెలు హాస్టల్ ఫీజు కొరకు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ స్రవంతి ఆర్థిక పరిస్థితిని ఎస్సై రామారావు తెలియచేయడంతో సహకారమందించామని, భవిష్యత్తులో ఆమెకు మరింత సహకారమందిస్తామని తెలిపారు. ఈమెను స్ఫూర్తిగా తీసుకొని ఆదివాసులు విద్యలో ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పి రామరావు, ఇల్లందు సింగరేణి సెక్యూరిటీ అదికారి అంజిరెడ్డి, కొత్తగూడెం సెక్యూరిటీ అధికారి రమణరెడ్డి, స్రవంతి కుటుంబ సబ్యులు పాల్గొన్నారు.

జీపీల ఆదాయం పెంచే దిశగా ప్రణాళికలు చేయాలి



నవతెలంగాణ-వేమనపల్లి

గ్రామపంచాయతీల ఆదాయం పెంచే దిశగా పంచాయతీకార్యదర్శులు, సర్పంచులు ప్రణాళికలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావ్ అన్నారు. బుధవారం మండలంలోని జిల్లెడ, సుంపుటం, దస్నాపూర్ గ్రామపంచాయతీలలో ఆయన ఆకస్మికంగా పర్యటించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం డంపింగ్ యార్డ్‌లను పరిశీలించి, చెత్త సేకరణ ప్రతిరోజు చేయించి యార్డ్‌కు తరలించాలన్నారు. కంపోస్టు తయారు చేయించి దానిద్వారా వచ్చిన ఆదాయాన్ని గ్రామపంచాయతీలో జమా చేయాలని అన్నారు. మొదటగా జిల్లెడ గ్రామపంచాయతీ బహత్ పల్లె ప్రకతి వనాన్ని సందర్శించి మొక్కల సంరక్షణకు తగు జాగ్రత్తలు చేపట్టాలని, డిసెంబర్ 31 నాటికి వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఏవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించి మొక్కల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనమే ధ్యేయంగా ముందుకూ సాగాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో శ్రీపతి బాపు, జిల్లెడ, సుంపుటం, దస్నాపూర్ సర్పంచ్‌లు చీర్ల కొండల్ రెడ్డి, కొండగోర్ల బాపు, తాటి పాముల రాజేశ్వరి, కార్యదర్శులు హరినాథ్, సిరాజ్, యూసఫ్ ఉన్నారు.

మారుమూల గ్రామాల్లో మెరుస్తున్న విద్యా కుసుమాలు

నవతెలంగాణ - రెబ్బెన



మారుమూల గ్రామాల్లో విద్యా కుసుమాలు మెరుస్తున్నాయి. ఒక చిన్న గ్రామమైన అక్కడి నుండి పోటీ పరీక్షల్లో రాణిస్తూ పలువురిని ఔరా అని పిస్తున్నారు. మారుమూల ప్రాంతమైన అక్కడి విద్యార్థులు ఎంతో పట్టుదలతో చదువుతూ రాష్ట్రంలోనే మండలంలోని తుంగెడ గ్రామానికి పేరు తీసుకొస్తూ కన్నవారి కలలకు బాసటగా నిలుస్తున్నారు. గతంలో సివిల్స్‌లో వెలువడిన ఫలితాల్లో 410వ ర్యాంకు సాధించి డోంగ్రి రేవయ్య ఉత్తమ ప్రతిభ కనబరచగా.. తాజగా బుధవారం వెలువడిన ఎస్ఈఈటీలో అదే గ్రామానికి చెందిన డోంగ్రి నేహిత్ 441వ ర్యాంకు సాధించారు. డోంగ్రి నేహిత్ ఒకటి నుండి 10వ తరగతి వరకు కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ పాఠశాలలో చదవగా, ఇంటర్ హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో పూర్తిచేశారు. ఇటీవల సివిల్స్ పరీక్ష రాసి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. గ్రామ యువత విద్యార్థులు చదువులో రాణించడంతో మండలంలోని ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు వారిని అభినందిస్తున్నారు.

అంగన్వాడీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్



అంగన్వాడీ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ,ఏఐటియుసి) సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సంఘాల ఆధ్వర్యంలో జిల్లా ఐసీడీఎస్ కార్యాలయంలోని అధికారికి, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోలకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా సంఘాల అంగన్వాడీ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు భానుమతి, జిల్లా కార్యదర్శి(ఏఐటీయూసీ) సరస్వతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల చెందినవారే ఎక్కువమంది ఉన్నారన్నారు. గత 45 సంవత్సరాలుపైగా ఐసీడీఎస్‌లో సేవలందిస్తున్నారని, అయినా వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ ఉద్యోగ భద్రత, ప్రమాద భీమా సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించలేదని ఆరోపించారు. అర్హులైన ఆయాలను టీచర్లుగా ప్రమోట్ చేయాలని, అద్దె భవనాలకు సొంత భవనాలు వెంటనే నిర్మించాలని, 2017 నుండి పెండింగ్లో ఉన్న టీఏడీఏలు వెంటనే చెల్లించాలన్నారు. ఎన్‌హెచ్, టీఎస్ యాప్‌లను రద్దుచేసి పోషణ్ ట్రాకర్ యాప్‌ద్వారా మాత్రమే పనులు చేస్తామన్నారు. ఆగస్టు 18న మహిళశిశుసంక్షేమ మంత్రి, కమీషనర్లతో, అంగన్వాడి ఉద్యోగ సంఘాలతో జాయింట్ మీటింగ్ జరిగిందన్నారు. ఆ సమావేశంలో కొన్ని డిమాండ్లు పరిష్కారం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని, కానీ దానికి భిన్నంగా అతి తక్కువగా రిటర్మెంట్ బెన్ఫిట్స్, వయోపరిమితిని పెంచడం జరిగిందన్నారు. సమస్యలకు పరిష్కారాన్ని చూపాలని లేని పక్షంలో సెప్టెంబర్ 11 నుంచి కేంద్రాలను మూసి వేసి సమ్మెలోకి వెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సత్యవతి, అనురాధ, రాధాబాయి, మహేశ్వరీ, జిల్లా కమిటీ సభ్యులు ప్రమీల పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వద్దు



నవతెలంగాణ-తాండూర్

గ్రామపంచాయతీల్లో మొక్కల పెంపకంపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులకు సూచించారు. బుధవారం పలు కార్యక్రమాలపై కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు . ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కల పెంపకం కోసం ఔత్సహికుల వద్దనుంచి మీసేవల ద్వారా దరఖాస్తులు చేయించి మండల కార్యాలయంలో అప్పగించాలని ఆదేశించారు, గ్రామపంచాయతీలలో అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించిన మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. గహలక్ష్మి దరఖాస్తుల ఆన్‌లైన్ డెటాను రెండురోజుల్లో పూర్తి చేసి నివేధికలను అందించాలన్నారు. గ్రామాలెల్లో క్రమం తప్పకుండా పారిశుధ్య నిర్వహణ, ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించలన్నారు.

జీపీల వివరాలు నమోదు చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

గ్రామపంచాతీల్లో చేపడుతున్న, పూర్తి అయిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో ఎంఏ అలీం సూచించారు. బుధవారం కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్, ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న వివరాలు, తీసుకోవాల్సిన చర్యలపై వివరాలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారులకు రాఖీ కట్టి రెండో ఏఎన్ఎంల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బేషరతుగా తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్‌తో ఏఐటియుసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా రెండవ ఏఎన్ఎంలు 15వ రోజు వైద్యశాఖలోని వైద్యాధికారులకు రాఖీ కట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ రెండో ఏఎన్ఎంల కడుపుకోత ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. మహిళలకు ముఖ్యమైన పండుగ రాఖీపౌర్ణమి రోజు రోడ్డుపైన ధర్నా చేయాల్సి రావడం దారుణమన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రెండవ ఏఎన్ఎంలు చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రజల ఆరోగ్యాలు కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నోటిఫికేషన్ రద్దుచేసి రెగ్యులర్ చేయాలని, లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి.దివాకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఏఎన్ఎంల యూనియన్ రాష్ట్ర నాయకురాలు వసంత, జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, ఉపాధ్యక్షులు రజిని, భాగ్య, ప్రచార కార్యదర్శులు భూదేవి, ప్రమీల కోశాధికారి సునీత, నాయకులు తిరుమల, సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణా నిపుణుడిగా కిరణ్‌కుమార్

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ శ్రీరాంపూర్ ఏరియా ఐఈడి విభాగంలో సూపరింటెండెంట్ ఇంజనీరుగా, ఎస్సీ లైజనింగ్ అధికారిగా పనిచేస్తున్న కిరణ్ కుమార్, గంప నాగేశ్వరరావు నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక ఇంపాక్ట్ ఫౌండేషన్ ట్రైన్ ద ట్రైనర్ వర్క్ షాప్ - 120లో నక్కా నవీన్ ఆధ్వర్యంలో 25 రోజులపాటు ఆన్‌లైన్ జూమ్ ద్వారా, రెండు రోజులపాటు ప్రత్యక్ష పద్ధతిలో నిజామాబాద్‌లో నిర్వహించిన శిక్షణా శిబిరంలో పాల్గొని సర్టిఫికెట్ పొందారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి కిరణ్‌కుమార్‌ను అభినందిస్తూ సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు అధికారులకు వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ ఇచ్చి గైర్హాజరు తగ్గించడంలో, పని విధానంలో సామర్థ్యం పెంచుకోవడంలో, కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడంలో తోడ్పాటు అందించవలసిందిగా కిరణ్‌కుమార్‌ను కోరారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జీఎం ఆదేశించినట్టు ప్రతి విభాగంలో తప్పకుండా వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తానని తెలిపారు. అలాగే సింగరేణి స్కూలు, ఎంవిటీసీ, పాలిటెక్నిక్ కాలేజీ, దగ్గరలో ఉన్న ప్రభుత్వ స్కూళ్లలో కూడా వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీఎం ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ చిరంజీవులు, డీజీఎం పర్సనల్ అరవిందరావు పాల్గొని కిరణ్‌కుమార్‌ను అభినందించారు.

నిరుద్యోగులపై లాఠీఛార్జికి ఖండన

నవతెలంగాణ-బోథ్

హైదరాబాద్‌లో 29న విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముందు శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని ఖండిస్తున్నామని మండల బీజేపీ అధ్యక్షుడు సుభాష్ సూర్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వెంటనే మెగా డీఎస్సీ, టీఆర్‌టీ ద్వారా పోస్టులు పూర్తిగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం 13,086 పోస్టులను భర్తీ చేయాలని, లేకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. నిరుద్యోగులందరికి నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి లాడేవార్ తుకారం, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల వెంకటేష్, సోషల్ మీడియా కన్వీనర్ బోరే రవీందర్ పాల్గొన్నారు.



విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-మందమర్రి



విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి అన్నారు. మహిళల భద్రత, పోలీసుల బాధ్యత కార్యక్రమంలో భాగంగా మందమర్రి జడ్పీ హైస్కూల్‌లో ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ, సైబర్ క్రైం, ట్రాఫిక్, షీ టీం, మహిళా చట్టాలు, భద్రత పట్ల ఉన్న చట్టాలను వివరించారు. సీఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ను జాగ్రత్తగా వాడాలని, అందులో మంచిచెడులు రెండూ ఉంటాయని అన్నారు. విద్యార్థులు కేవలం మంచిని మాత్రమే తీసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులతో చాటింగ్ ప్రమాదాలకు దారి తీస్తుందనీ, వ్యక్తిగత సమాచారం ఇతరులకు పంపవద్దనీ, సోషల్ మీడియా యాప్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. టినేజ్ పిల్లలు చెడుపట్ల తొందరగా ఆకర్షణకు గురవుతారనీ, కేవలం చదువుపైనే దృష్టిసారించాలన్నారు. ఎలాంటి సమస్యలున్న డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై చంద్రకుమార్‌లకు విద్యార్థులు రాఖీలు కట్టారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన వక్ష బంధన్ లో పాల్గొని మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ విద్యార్థులు తయారు చేసినటువంటి రాఖీలను చెట్లకి కట్టారు. కార్యక్రమంలో ఏఎస్సై మల్లేశం, హెడ్ కానిస్టేబుల్ పద్మ, కానిస్టేబుల్ మహేష్‌లు పాల్గొన్నారు.

ఆదివాసీ నాయకుడి వర్ధంతి

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని దేవాపూర్ నాయకపుగూడలో ఆదివాసీ నాయకుడు రొడ్డ చిన్న రమేశ్ 3వ వర్ధంతినిఆదివాసీ నాయకపోడ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయాల ప్రకారం రొడ్డ చిన్న రమేశ్ విగ్రహం పూజాల చేశారు. అనంతరం విగ్రహానికి పూలమాలు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి కొమ్ముల బాపు, జాయింట్ సెక్రెటరీ తత్ర భీంరావు, మద్దిమాడ సర్పంచ్ ఆడె జంగు, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యాక్షుడు కనక రాజు, నాయకపోడ్ సేవా సంఘం మండల అధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, కార్యదర్శి రెడ్డి లక్ష్మణ్, కోశాధికారి రొడ్డ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ సమావేశం

నవతెలంగాణ-నస్పూర్



నస్పూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మేన్ ఈసంపల్లి ప్రభాకర్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశం రసభసాగా జరిగింది. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న జనగామ నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మతి చెందడంతో ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. 28 అంశాలపై ప్రవేశ పెట్టిన తీర్మాణం చేయడంతో కొందరు కౌన్సిలర్లు అభివద్ధి పనులలో అవినీతి జరిగిందని ఆమోదం తెలుపలేదు. మెజారిటీ సభ్యులచే సమావేశంలోని కౌన్సిల్ 27 అంశాలను ఆమోదించారు. మున్సిపాలిటీ పరిధిలోని 4వవార్డులో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారుల దష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవడంలేదనిగత కౌన్సిలర్ బెడిక లక్ష్మి సమావేశంలో నిరసనకు చేపట్టారు. ఆమెకు మద్దతుగా వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు బేర సత్యనారాయణ, బౌతు లక్ష్మి, కాంగ్రెస్ కౌన్సిలర్లు సురిమిళ్ల వేణు, బొద్దున సంధ్యారాణి, తెనుగు లావణ్య, సీపతి సుమతి, జల్లు రజిత మద్దతు తెలిపారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూములను కాపాడాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఏఈ మధు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఆరోపణలు అవాస్తవం

నవతెలంగాణ-దహెగాం

దళితబంధు విషయంలో బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని దళితబంధు లబ్దిదారులు అన్నారు. బుధవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. దళితబంధు పథకంలో బీఆర్ఎస్ నాయకులు కమీషన్‌లు తీసుకున్నారని ఆరోపించడం సరికాదన్నారు. వాస్తవంగా అర్హులుగా ఉన్నందుకే తమకు దళితబంధు పథకం లబ్ధిచేకూరిందని, బీజేపీ నాయకులు ఓర్వలేకనే అధికార పార్టీల నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితులను ఆర్థికంగా ఎదిగేందుకు ఆర్థిక సాయం చేస్తే దానిని జీర్ణించుకోలేక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో దళితబంధు లబ్ధిదారులు లక్ష్మీ, అనసుయ, బాయక్క, రావూజీ, పోశం, నాందేవ్ పాల్గొన్నారు.